ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులైన యువకులారా!

తపస్సుచే లభ్యముగాని ఫలితము, తీర్థయాత్రచే ప్రాప్తించని ఫలితము, శాస్త్రపఠనముచే, జప ధ్యానములచే లభ్యముగాని ఫలితము సేవద్వారా మనకు ప్రాప్తిస్తుంది. పై కర్మలన్నియూ యేదో కొంత స్వార్థముతో కూడినవై ఉంటాయి. సేవ అహంకార రహితమై, స్వార్థరహితమైన రూపాన్ని ధరిస్తుంది. యువత వేగుచుక్క వంటిది. యవ్వనము అనుగ్రహింపబడిన వరప్రసాదము. ఇట్టి పవిత్రమైన, యిట్టి దివ్యమైన యవ్వనమును సద్వినియోగ పరచుకోవాలి. ప్రతి యువకుడూ క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో జీవించుటకు తగిన కృషి చేయాలి.

మొట్టదట యువకులు జాతీయతా భావాన్ని అభివృద్ధి పరచుకోవాలి. సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వమునకు నిలయము మన ఇల్లే. ఇట్టి సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వమునకు నిలయమైన మన యింటియందే యిట్టి సౌమ్యము, సమత్వము, సమైక్యత కోల్పోయిన యింక దేశములో మనకు ఎక్కడ లభిస్తుంది? ఇంటిలో లేని సౌభ్రాతృత్వము దేశములో మనకు లభ్యము కాదు. ఇంటిలో లేని ఐకమత్యము దేశములో మనకు లభించదు. భారతీయులు స్వాతంత్ర్యమును సంపాయించారుగానీ ఐక్యతను సాధించలేక పోతున్నారు. ప్రాచీన కాలమునుండి సమైక్యత లేకపోవటం చేతనే భారతదేశము ఛిన్నాభిన్నమై అనేకవిధములైన యిక్కట్లకు గురౌతూ వచ్చింది. యువకులు భారతదేశమన్న, భరతీయసంస్కృతియన్న ప్రజలలో గౌరవము, విశ్వాసము కలిగే రీతిగా యువకులు ప్రవర్తించాలి. ఇట్టి గౌరవవిశ్వాసములకు ప్రాచీనకాలము నుండి భారతదేశములో ప్రజల గుండెలలోపల పాతుకొనిపోయిన దేశాభిమానము, త్యాగము, ఆధ్యాత్మిక ధృక్పధము ఈ మూడూ అత్యవసరమైనవి. దుర్ధృష్టవశాత్తు యీనాటి ప్రజలయందు జాతీయభావము కోల్పోతూ వచ్చారు. త్యాగమునకు బదులు భోగమును ఆశిస్తూ వచ్చారు. ఆధ్యాత్మిక ధృక్పధమునకు విరుద్ధముగా నాస్తికత్వమును పెంపొందిస్తూ వచ్చారు. కనుక, ఈనాడు భారతదేశమందు కనివిని యెరుగని ఈ దురవస్థలను చూడవలసి వచ్చింది. ఏనాడు భారతీయులు ఆత్మవిశ్వాసము కోల్పోయిరో ఆనాడే భారతదేశమునకు ముప్పు ప్రారంభమైంది. ఆత్మవిశ్వాసము అత్యవసరము. ఇట్టి విశ్వాసము లేని జీవితము దురవస్థలకు గురౌతుంది.

ప్రపంచములో ఈనాడు యువకులందు అశాంతి చెలరేగటానికి కొన్ని కారణములున్నవి. దీనికి రాజకీయములు మొదటి కారణము. రెండవది మనయందున్న దివ్యమైన భావములుమనము ఆవిర్భవింప చేసుకోలేకపోవటం. మూడవది రహస్యమైన ఈ సినీమాలు. నాల్గవది అర్థరహితమైన, అసహ్యమైన కథల పుస్తకాలు. వీటి వలనే యువకులు దారి తప్పి అనేకవిధములైన పెడమార్గములు పడుతూ తమ పవిత్రమైన కాయమును, జీవితమునూ వ్యర్థము చేసుకుంటున్నారు. మానవత్వములో అనేక గుణములు అంతర్భూతమై ఉంటున్నాయి. ఇట్టి తనయందు అజ్ఞాతమై ఉండిన సుగుణములను మనము తెలుసుకొన లేకపోతున్నాము. దీనిని యింటి యందు తల్లిదండ్రులు, విద్యాసంస్థలందు ఉపాధ్యాయులు సరైన బోధలు సల్పి అంతర్భూతమై, అగోచరమై ఉండిన మన శక్తులను ఆవిర్భవింప చేయాలి. ఈ ప్రయత్నము చేయలేకపోవటం చేతనే యువకులయందుండిన అమూల్యమైన ఈ ధనమును మనము అందుకోలేకపోతున్నాము.

యువకులందు అమూల్యమైన, విలువైన ధనము సద్గుణమే. ఆవిధమైన గుణముండినప్పుడే మానవుడు దేవుడు కాగలడు. the qualities numbering six. character, non-violence, pity, control of senses, control of mind, fame. రాముడు దేవుడు కావటానికి యిదే కారణం. మొట్టమొదట శీలము. రెండవది అహింస. మూడవది దయ. నాల్గవది సంపత్తి. ఐదవది యింద్రియనిగ్రహము. ఆరవది కీర్తి. ఆ ఆరింటి వల్లనే మానవాకారము ధరించిన రాముడు దేవుడుగా మారిపోయాడు. భారతదేశమందు పుట్టిన ప్రతి యువకుడూ కూడా ఈ ఆరు గుణములూ, షట్ చక్రములుగా భావించి, షడ్గుణములుగా భావించి, షట్‌దర్శనములుగా భావించి జీవించటానికి తగిన కృషి చేయాలి. ఈనాటి యువకులందు క్రమశిక్షణ, చిత్తశుద్ధి అత్యంత దూరమైపోయింది. కనుక, మానవునియందు క్రమశిక్షణ చాలా అవసరము. ఈనాటి యువకుడు విద్యానిమిత్తమై పట్టణములలో చేరి విద్యాసంస్థలలో ప్రవేశించి తద్వారా విద్యార్థి సంఘములందు పాల్గొంటూ, స్ట్రైకులందు పాల్గొంటూ, రాజకీయములందు పాల్గొంటూ క్రమక్రమేణా విలువైన జీవితమును నాశనము చేసుకుంటున్నాడు. ఇటు విద్య, అటు దివ్యత్వము రెండింటిని కోల్పోయి బంగారువంటి జీవితము విషయవాసనల కమ్ముకొని భస్మము గావించుకొంటున్నాడు. మానిక్యమువంటి మానవ జీవితాన్ని కామ క్రోధములనే మసిబొగ్గుల కమ్ముకొని జీవించటానికి పూనుకుంటున్నాడు. రాగద్వేషములకు అమ్ముకొని వీరు జీవితమును రాగరహితంగా మార్చు కుంటున్నారు. మానవ జీవితము చాలా విలువైనది. జీవించదగినది. దీని విలువ ప్రతి మానవుడు మొట్టమొదట గుర్తించాలి. పట్టణములో ప్రవేశించి తనకు సంబంధము కాని మార్గములలో ప్రవేశించి తద్వారా తమ తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ధనము వ్యయము. కాలము వ్యర్థము. మానవుని యందున్న దివ్యశక్తి కూడా నాశనము గావించుకుంటున్నాడు. ఈవిధమైన జీవితమునుంచి మనమీనాడు దివ్యమైన, భవ్యమైన, పవిత్రమైన మార్గములో తిప్పటానికి తగిన కృషి చేయాలి. యువకులు నిరంతరము ఏదో ఒకవిధమైన ఆదర్శవంతమైన పనులలో పాల్గొనాలి. పనికిరాని మాటలచేతను,

అపవిత్రమైన కర్మల చేతను కేవలము దుస్సంగములతో కూడిన దుర్భావముల చేతను మానవుని మనస్సు మాలిన్యము చేసుకోరాదు.

యువకులకు సత్సంగము అత్యవసరము. సత్ అనగా ఏదో ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించినవారు, భౌతికమునకు కొంత దూరంగా ఉంటుండి దివ్యమైన దైవము గురించి మాట్లాడేవారు, సాధనలు సల్పేవారు అలాంటి వారితో చేరటము సత్సంగముగా భావిస్తారు. అదికాదు సత్సంగము. సత్ అనగా సత్యము, స్థిరము. త్రికాలములందు మార్పుచెందనిది సత్. అదే దైవత్వము. అట్టి దైవభావముతో మనము నిరంతరము స్నేహము కల్గి ఉండాలి. అట్టి స్నేహము కల్గినప్పుడే యిది సత్సంగము అవుతుంది. మనది అంగము. అంగములో సంగము, సంగములో జంగము, జంగములో లింగము. అంగ, సంగ, జంగ, లింగ ఈ నాల్గింటియందు అంగము కేవలము అనిత్యమైనది, అశాశ్వతమైనది. ఇది సర్వాంగములతో చేరినది కనుక, అంగము అన్నారు. అంగములో ఒక సంగము ఉంటున్నాది. సొసైటీ. ఆ సొసైటీయే అరిషడ్వర్గములు. కామ, క్రోధ, లోభ, మద, మత్సరములు. ఇదే సంఘము. ఈ సంఘములో ఏనాడు ఐకమత్యమనేది ఎరుగదు, పెరుగదు. ఒకడు ఎస్, ఒకడు నో. కన్ను ఏమైనా మంచిని చూడాలని ఆశిస్తే తక్షణమే చెడ్డను వినాలని ఆశిస్తుంది చెవి. ఒకదానికొకటి పొత్తే కుదరదు. ఇలాంటి సంఘములోపల ఉండటం చేత మనలో ఆవిర్భవించే సద్భావములంతా దుర్భావములుగా రూపొందుతూ వచ్చాయి. అంగములో యిదొక సంఘము. ఈ సంఘములో ఒక జంగమయ్య ఉన్నాడు. అతడే జీవతత్త్వము. ఆ జీవుడే జంగము. ఈ జంగమును కొంత వరకు విచారణ చేసినప్పుడు 'ఛీ! నేను జీవితములో యేనాడూ ఎరుగని ఈ పెడమార్గములో నేను ప్రవేశించటమా! జీవితమునకిది సరైనది కాదు'. ఈ జంగములోపలనున్న ఆత్మ అనే లింగాన్ని నిరూపిస్తుంది. ఈ జంగలింగముల సమైక్యతే నిత్యమైన, సత్యమైన సత్. ఈ దుర్గుణములైన అరిషడ్వర్గములను దూరముగావించుకొని జీవాత్మల సంయోగములను మనము ఆశించటమే సత్సంగము. కనుకనే, జపము చేసేవారు నాలుగు వేళ్లు ఒకవైపున ఉన్నాయి, ఒక వేలు మరొకవైపున ఉంది. ఇది (బొటన వేలు) దైవత్వము, లింగము. రాజసికము, తామసికము, సాత్వికము. ఇది (చూపుడు వేలు) జీవుడు. ప్రపంచములో ప్రతిఒక్కటి యిది మంచి, యిది చెడ్డ అని నిరూపించేది ఈ జీవుడే. ఈ జీవుడు ఈ మూడు గుణములతో సంబంధము యేర్పరచుకోటం చేత దైవం దూరంగా ఉన్నాడు. కనుక, జపము ఆచరించేవారు ఈ సత్ అనే గుణముపైన జపమాలను వేసుకొని, జీవుడు దేవుడు ఈ రెండింటితో జపము చేసినప్పుడు యిదే జీవబ్రహ్మ ఐక్యానుసంధానము. ఇదే నిజమైన సత్. సత్సంగమనగా పదిమందితో చేరటము, మంచివారితో చేరరటము, మంచి కార్యములు చేయటము, మంచి విషయములు వినటము యిది మాత్రమే సత్సంగము కాదు. ఇది ప్రాపంచికమైన, భౌతికమైన, ప్రాకృతమైన, లౌకికమైన సంఘము. ఇది కొంతకాలములో మార్పు చెందేవే. యివన్నీ ప్రతిబింబములే. బింబము తనయందే ఉంటున్నాది. కనుక, బింబాన్ని మనము ఆశ్రయించాలి, ప్రతిబింబమును కాదు. దీనినే follow the master అన్నాడు స్వామి. who is the master? నీ conscience నీ master. conscience follow do not follow the mind, mind is like a mad monkey. do not follow the body, body is like a water bubble. follow the conscience. ఇది సత్సంగము. ఈనాటి యువకులు నూటికి తొంభైతొమ్మిది భాగములు మనసునే అనుసరిస్తున్నారు. మనసును అనుసరించిన తక్షణమే ఈ జడమైన boby slave గా బయలుదేరుతున్నాది వెంట. దేహము కేవలము జడమైనది. జడమైనదైనప్పటికి మనస్సును ఆశ్రయించటం చేత అది కూడను కర్మలకు మూలకారణమైపోతుంది.

కనుకనే, కర్మలాచరించుటకు శరీరము అత్యవసరము. ఐతే దేనిని ఆశ్రయిస్తే మంచి కర్మలు చేయవచ్చు. conscience ను ఆశ్రయిస్తే మంచి కర్మలు చేయవచ్చు. మైండును ఆశ్రయిస్తే చెడ్డకర్మలలో ప్రవేశిస్తాడు. మైండు అంటే ఏమిటి? కోర్కెల సమ్మిళిత స్వరూపమే మనస్సు. ఈ కోరికలు మనకు తీరేవి కావు. ఒకటి తీరిన తర్వాత మరొటి ఆశిస్తుంది. ఈవిధముగా ఆద్యంతములు లేని కోరికలను మనం అనుసరించటం మంచిది కాదు. దానికి కూడా కొంత పరిమితం ఉంటున్నాది. తినటానికి తిండి, కట్టటానికి బట్ట ఉండాలి. ఉండటానికి కొంప ఉండాలి. అంతోయింతో రోగం వస్తే ఔషధము తీసుకోటానికి డబ్బు ఉండాలి. ఇవన్నీ మానవునికి అతేయవసరమైనవి. పరిమితం మించి మనం పోకూడదు. ఇప్పుడు మనకు దాహంగా ఉంది. దాహముగా ఉన్నప్పుడు కప్పు నీరు తీసుకుంటే దాహము తీరుతుంది. నాకు దాహంగా ఉంది, గంగా నది అంతా కావాలి అని ఆశించేవాడు ఎంత మూర్ఖుడు చెప్పండి. గంగానది త్రాగాలా! జానెడు పొట్ట నింపుకోటానికి పటెట్టన్నముంటే చాలు. నాకు తట్టెడన్నము కావాలంటే యిది వృథా చేయటం కదా! మనము గాలి లేక జీవించ లేము. కానీ, గాలి అఇధకముగా వస్తే ఉక్కిరిబిక్కిరి అయిపోతాము. ఈ దేహములో ఉష్ణము ఉండినప్పుడే యిది ఒక పరిమితంగా ఆరోగ్యముగా ఉంటుంది. కానీ, 99 డిగ్రీలు దాటితే రోగిష్టి అవుతాడు. కనుకనే, పరిమితమైన ఆశలతో ఉండటమే ఆరోగ్యము. మితిమీరిన ఆశలకు పోవటమే మతి చెడటము. కనుక, less luggage more comfort, make travel a pleasure అని. మన కోరికలే లగేజి. ఈ లగేజి మనం కొంచెం తక్కువ చేసుకోవాలి. దానినే వేదాంత పరిభాషలోపల వైరాగ్యము అన్నారు. వైరాగ్య మనగా ఇల్లువాకిలి, తల్లిదండ్రి, పిల్లలు, ధనము, ధాన్యములు యివన్నీ వదలి అడవికి పోయి ముక్కు మూసుకొని డొక్కలు కొట్టుకుంటూ కూర్చోటం కాదు. నీ ఇంటిలో నీవు ఉండు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. నీ భాధ్యత నీవు ఆశ్రయించు. ఇది చేస్తూ పవిత్రమైన భావాలతో హృదయాన్ని పరిశుద్ధము గావిస్తూ రావాలి. ఇది నిజమైన వైరాగ్యము. వైరాగ్యమనగా వస్తువులను

వదలిపెట్టి వెళ్లటం కాదు. వాంఛలను వదలటమే వైరాగ్యం. ఇవన్నీ సేవలో మనకు లభిస్తాయి. నాయకుడుగా ఉండినప్పుడు అహంకారిగా ఉంటాడు. ఈ అహంకారము మనిషిని అథఃపతనము చేస్తుంది. ఈ అహంకారము మానవుని స్వార్థాన్ని పెంచుతుంది. కోరికలను దినదినాభివృద్ధి గావింప చేస్తుంది. కనుక, ఈ కోరికలు తగ్గించుకొని అహంకారమును హతమార్చుకోటానికి నడుము వంచి సేవకుడుగా బయలుదేరాలి. సేవకుడు కాక నాయకుడు కాదు. ఈనాటి నాయకులందరూ సేవకత్వము తెలియనివారు కనుకనే ఈనాటి నాయకత్వములోపల ప్రపంచమంతా అనేక అవస్థలకు గురికావలసి వచ్చింది. మనము దైవముగా రూపొందాలంటే కింకరుడైనప్పుడే శంకరుడుగా రూపొందుతాడు. అహంకారము పోవటానికి గొప్ప అవకాశము యిస్తుంది. ఈ సేవలందు పవిత్రమైన కాలమును సార్థకము చేసుకోవాలి.

మానవునకు బాల్యము, యవ్వనము, కౌమారము, వార్ధక్యము నాలుగు స్థాయిలుంటున్నాయి. బాల్యములో మనకు యేమీ తెలియదు. యవ్వనములో అనవసరమైనవన్నీ లోపల చేరిపోతుంటాయి. అప్పుడే మనం అత్యంత జారగత్తగా ఉంటుండాలి. మంచిచెడ్డల discrimination మనం చక్కగా చేయాలి. మనం ఇల్లు కట్టుకున్నాం. ఇంటికి ద్వారము పెట్టుకున్నాం. గాలి కావాలి మనకు. గాలి వచ్చే నిమిత్తమై కిటికీలు పెట్టుకున్నాము. ఐతే ఈ ద్వారం, కిటికీలు పెట్టుకోటంలో అంతరార్థము ఏమిటి? ఈ ద్వారం వల్ల మనం బయటకు పోవటము, రావటము, మన యింటికి సంబంధించిన బంధువులు రావటం పోవటం. దీనికి ఉపయోగించుకోవాలి. ఈ ద్వారము ఉందికదాయని బజార్లో తిరిగే పందులు గాడిదలంతా లోపలకు విడుస్తామా! మన ఈ దేహమనే పవిత్రమైన భవనమునకు మొట్టమొదట ఐదు senses ను ద్వారాలుగా పెట్టుకున్నాము. ఈ ఐదు ద్వారాల ద్వారా మంచిని మాత్రమే చేర్చాలి. మంచిని మాత్రమే కన్నులు చూడాలి. మంచిని మాత్రమే ఈ నాసిక ద్వారా తీసుకోవాలి. రుచికర పదార్థములు, యితరులను ఆనంద పరచే పలుకులు ఈ ద్వారములో ప్రవేశపెట్టాలి. చర్మము. ఇది ఐదవ యింద్రియము. దుస్సంగముతో యితరులయొక్క దుర్గుణములతో, దురాచారములతో నిండిన దేహాన్ని మనం తగల కూడదు. మీకు తెలుసు, విద్యుత్. ఎవరైనా పోయి దాన్ని పట్టుకుంటే వానిని పట్టుకొన్ని లక్షమందికి షాక్ వస్తుంది. కనుక, దుర్భావములతో, దుర్గుణములతో, దురాచారములతోనిండిన వానిని మనము సంగముగా చేసుకుంటే అదంతా ప్రాకుతుంది. మన దేహములో ఒక పెద్ద పవరు ఉంటున్నాది. ఈ పవరు అందరిలోనా ప్రవేశిస్తుంది. కనుకనే, దుస్సంగముచేత దుర్బుద్ధులు మనకు ప్రారంభమౌతాయి. tell me your company, i shall tell you what you are. 'నీ స్నేహితుని విషయం చెప్పు, నీవు ఎలాంటివాడవో చెప్పగలను' అన్నాడు. స్నేహితుడు మంచివాడైతే నీవూ మంచివాడే. స్నేహితుడు చెడ్డవాడైతే నీవుకూడా చెడ్డవాడే. దుస్సంగమునకు అతి దూరంగా ఉంటుండాలి. అనేకమంది ఉపవాసమని చేస్తుంటారు. ఏమిటి ఈ ఉపవాసము? ఉప..వాసము. ఉప..సమీప. వాసము..నివాసము. దేనికి దగ్గరగా నివసించాలి? దీని అంతరార్థములు ఆధ్యాత్మికములో అనంతంగా ఉంటున్నాయి. కానీ, ఈ అంతరార్థములు ఎవరూ విచారించటం లేదు. మన పెద్దలు ఎవరూ బోధించటం లేదు. కనుక, యువకులకు ఈ విషయములు యేమాత్రమూ తెలియటం లేదు. ఉప…సమీపము. ఎవరి సమీపము? ఏది మంచి? దివ్యత్వమే మంచి. ఉపనిషద్ అనగా ఉప.. సమాపము, ని..క్రింద, షద్.. కూర్చో. దగ్గర క్రిధ కూర్చో అని ఉపనిషత్‌కి అర్థము. ఎందుకు క్రింద కూర్చోవాలి? అంతరార్థము మీరు చక్కగా గుర్తించాలి. ఏమీ తెలియనివాడు క్రింద ఉండాలి. తెలిసినవాడు పైన ఉండాలి. అనగా పెద్దలు ఉన్నతస్థాయిలో ఉంటుండాలి. చిన్నవారు కొంచెం తక్కువ స్థాయిలో ఉండాలి. ఈ అంతరార్థము ప్రబోధించే నిమిత్తమై ప్రశ్న అడిగేవాడు శిష్యుడు, జవాబు చెప్పేవాడు గురువు. కాబట్టి గురువు గురుస్థానంలో ఉండాలి. శిష్యుడు శిష్యస్థానంలో ఉండాలి. తెలుసుకోనేవాడు కనుక క్రింద కూర్చో నీవు. తెలిపేవాడిని కనుక నేను పైన కూర్చుంటా. పైన, క్రింద అంటే కుర్చీలు, బల్లలపై కాదు. ఉన్నతస్థాయిలో ఉన్నవాడు గురువు. అధోస్థాయిలో ఉన్నవాడు శిష్యుడు. దీనిని పురస్కరించుకొనియే ఉప ని షద్ అని చెప్పారు. సమీపంలో ఉండటం వలన మనకు లభించే ఫలితము ఏమిటి? ఎయిర్‌కండిషన్ రూమ్ ఉంది. ఎయిర్‌కండిషన్ సమీపంలో నీవు కూర్చుంటే నిన్ను బాధించే వేడి దూరమవుతుంది. నీకు హాయి, చల్లదనము అందిస్తుంది. అదే ఒక హిల్ స్టేషన్‌కి పోయినప్పుడు, హీటర్సు ఉంటాయి అక్కడ, నిన్ను బాధించే చలి దూరమవుతుంది. ఆనందము కల్గించే వెచ్చదనము యిస్తుంది. అదే రీతిగా దైవత్వమునకు సమీపంగా ఉంటే దైవగుణం నీలో ప్రవేశిస్తుంది. కనుకనే, దైవానికి సమీపంగా ఉండటం, సమీపాన్ని కోరటం ఉపవాసము. భగవంతుని సమీపంలో ఉన్నప్పుడు దుర్గుణములు దూరమౌతాయి. భగవద్గుణములు నీలో ప్రవేశిస్తాయి. కనుక, సమీపత్వమనేది ఉపవాసమునకు సరైన అర్థము. ఈనాటి ఉపవాసములు ఒక సేరు పాలు త్రాగటమో, ఒక అరడజను అరటిపండ్లు తినటం, ఇడ్లీలు తినటం, అన్నం తినకుండా ఉండటం ఉపవాసం అనుకుంటున్నారు. కానీ, దానికి మించి భుజిస్తున్నారు. ఈనాటి యువకులుకూడా రాజకీయములలో ప్రవేశించి దానిలో దీక్షలు పూనుతున్నారు. ఏమిటా దీక్షలు? ఉపవాస దీక్షలు. ఎంత సేపు? రెండు గంటలు. ఇవన్నీ హాస్యాస్పదమైన పదములు. ఇలాంటివి కాదు ఉపవాసములు. మనము ఏ పవిత్రమును విజయం సాధించాలో, ఏ దివ్యత్వంలో మనము ఆనందాన్ని పొందాలో దానికి సమీపంలో ఉండాలి. అంతేగానీ తుచ్ఛమైన, అల్పమైన, అస్థిరమైన ఈ మలినమైన కోరికలు సాధించే నిమిత్తమై ఉపవాసం కాదు. ఈ పదములు అటువంటివాటికి పెట్టటం కూడా మహా పాపమనే చెప్పాలి. నిరాహార దీక్ష. ఏమిటి ఆహారం? గంటగంటకు భుజించటమేనా! గంట

భుజించకపోటం నిరాహారమా? కాదు, కాదు. కొన్ని పదములు మీరు బాగా యోచన చేయవచ్చు. అల్పమునకు, స్వల్పమునకు ఉన్న వ్యత్యాసము మీరు గుర్తించాలి. స్వల్పమనగా పవిత్రత అధికము, పదార్థము తక్కువ. అల్పమనగా పదార్థము అధికము, పవిత్రత తక్కువ. దీనికి చిన్న ఉదాహరణ. ఒక టీస్పూన్ పాలు అంటే క్వాలిటీ ఎక్కువ, క్వాంటిటీ తక్కువ. ఒక సోడా అంటే క్వాంటిటీ ఎక్కువ, క్వాలిటీ తక్కువ. మీరు పేపర్లో చదువుతున్నారు, మినిష్టరుగారు వచ్చినప్పుడు అల్పాహార విందు చేశామంటారు. అల్పాహార మనగా పేడ వంటిది అన్నమాట. ఇలాంటిదా విందు చేయటం! ఈ పవిత్రతనుకూడా మనం గుర్తించుకోలేకపోతున్నాము. ఏదో టీ, బిస్కట్లు యిస్తే అల్పాహార విందు అనుకుంటున్నాము. పదములుకూడా ఎక్కడెక్కడ ఎలాంటి పదములు ఉపయోగపెట్టాలో మనం నేర్చుకోవాలి. మన ఇంట్లో ఒక నౌకరుంటాడు. 'ఒరే రంగన్నా! రారా' అని పిలుస్తాము. రారా అంటాము. అది పని వానికి ఉపయోగపెట్టే పదము. ఇంకెవరన్నా పెద్దవారు యింటికి వస్తే 'రండి, దయచేయండి' అంటాము. చూశారా! ఎలాంటి వారికి పదములు మనము వినియోగించామో! కనుక, ఉన్నతమైన పదములు ఉన్నత స్థాయికి మనం మాటలు కూడా సరైన రీతిలో ప్రవేశపెట్టాలి. ఈ ద్వారం you can not always oblige but you can speak obligigly. వినయవిధేయతలతో పలుకులను ఉచ్చరించాలి. కనుక, ఈ ద్వారమునందు అంతాకూడా ఎంత పవిత్రమైనవో అవి ప్రవేశపెట్టాలి. ఈ ఉపవాసముకూడా ఏదో చేస్తున్నారు కాలనుగుణ్యంగా తక్కువగా భుజిస్తున్నారు. ఏదో ఉప్మా అని భుజిస్తున్నారు. ఇది ఉపవాసం కాదు. సాత్వికాహారం ఒక్క నోటితో తీసుకున్నంత మాత్రాన ఉపవాసం కాదు. ఈ ఐదు ద్వారముల ద్వారా సాత్వికమైన ఆహారము మనం తీసుకోవాలి. అదే సాత్వికాహారం. నోటితో తీసుకోటం ద్వారా ఒక్క రంధ్రం ద్వారా పోతుంది. మిగిలిన నాలుగు రంధ్రాలుంటున్నాయి. వాని ద్వారా చెడ్డను వినటం, చెడ్డను చూడటం, చెడ్డ పనులు చేయటం యిదంతా మెజారిటీ ఎక్కువైపోయింది. ఉన్న ఐదు రంధ్రములలో ఒక్క రంధ్రము ద్వారా మటుకు సాత్వికము తీసుకొని, మిగిలిన నాలుగు రంధ్రముల ద్వారా రాజసికము, తామసికము తీసుకుంటే అది క్వాంటిటీ ఎక్కువైపోతుంది. యువకులు ఈ పంచేంద్రియముల ద్వారా పవిత్రమైన దానిని అందుకోవాలి. అప్పుడే ఆదర్శవంతమైన యువకులుగా తయారౌతారు. ఈనాటి యువకత్వంలో ఉన్న పవిత్రతను గుర్తించాలి.

మానవత్వంలో త్యాగం అవసరం. దీనిని పురస్కరించుకొనియే ఉపనిషత్తులలో, 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృత్త్వ మానసుః' ఈ త్యాగము అమృతత్త్వముతో సమానము. నిత్య జీవితంలో మన దేహాన్ని చక్కగా గుర్తించండి. త్యాగం ఎలా ఉందో యోచించవచ్చు. ఒకవైపు మనం భుజిస్తున్నాము. మరొకవైపు అన్‌లోడ్ చేయకపోతే పొట్ట చెడిపోతుంది. మనం తీసుకోవాలి. ఆ త్యాగము చేతనే మనకు క్షేమం ఏర్పడుతుంది. గాలిని తీసుకుంటున్నాము. ఈ తీసుకున్న గాలిని మనం వదలకపోతే మన లంగ్సు పాడైపోతాయి. అదే రీతిగా రక్తము ప్రసరిస్తున్నప్పుడే దేహము ఆరోగ్యంగా ఉంటుంది. ఎక్కడైనా ప్రసరించక నిల్చిపోతే గడ్డ ఏర్పడుతుంది. కాబట్టి త్యాగంచేత ఎంత క్షేమం ఏర్పడుతుంది! అదేవిధముగా ధనమును సంపాయిస్తున్నాము.సంపాయించిన ధనము త్యాగము చేయాలి. ఊరికే బ్యాంకులో డిపోజిట్లు పెట్టుకుంటే ప్రయోజనం లేదు. బ్లడ్డు, డుడ్డు సర్కులేషన్ కావాలి. అప్పుడే దీనికి సరైన ఆనందము, ఆరోగ్యము ఏర్పడుతుంది. ఈ త్యాగము యువకులు చక్కగా గుర్తించాలి. వినటానికి చాలా చిన్నవిగా ఉంటాయి. ఈ చిన్న దానినుండే గొప్ప దివ్యత్వం ఆవిర్భవిస్తుంది. విత్తనం చూస్తే చాలా చిన్నది. కానీ, అది గొప్ప వృక్షంగా రూపొందుతుంది. చిన్నదే అని మనం అలక్ష్యం చేయకూడదు.

ప్రతి వ్యక్తి జాతీయతాభావాన్ని ఈనాడు పెంచుకోవాలి. ఈ జాతీయతాభావం లేకపోవటం చేతనే మన దేశం చాలా క్షీణించిపోతున్నాది. భారత దేశముయొక్క జాతీయతా ధర్మములు, సంస్కృతులు చాలా అధికంగా ఉంటున్నాయి. ఈనాడు ప్రతి ఇంటియందు మీరు చూడండి, చెప్పేటువంటి పెద్దలందరూ ఉపన్యాస వేదికలపై చాలాచాలా గొప్పవిషయాలంతా బోధిస్తుంటారు. ఈనాటి యువకులంతా చెడిపోటానికి మూలకారణం ఈ సినీమాలే. ఈ పిచ్చి పుస్తకాలే. ఈ రాజకీయములనే బోధిస్తుంటారు. కానీ, ఈ చెప్పే పెద్దమనిషి తన యింట్లో ఎందుకు కంట్రోల్ చేయలేదు? తన యింటిలో తన పిల్లలు ఎలాంటి పుస్తకాలైనా చదువుతున్నారు, ఎలాంటి పిక్చర్సు చూస్తున్నారు, ఎలాంటి విషయాలో వీరు సంభాషణలు సల్పుతూ ఉంటారు. అదే పెద్దమనిషి తన మిత్రులెవరైనా వస్తే వారితో కూర్చొని పిచ్చి మాటలంతా మాట్లాడుతూ, బటిల్సు పెట్టుకొని త్రాగుతూ, పేకాట ఆడుతూ, సిగరెట్టు పీలుస్తుంటే వారి పిల్లలు ఏరీతిగా వినగలరు? కనుక, ఈ పెద్దలే పిల్లలను చెడగొడుతున్నారు. కనుక, పెద్దలు మంచి మార్గములో ప్రవేశించాలి. చెప్పటం మంచి, చేయటం చెడ్డ. కనుకనే, ఈనాటి యువకులు పెడమార్గం పట్టటానికి కారణం అయింది. పూర్వము, స్వాతంత్ర్యము రాకముందు భారతీయ యువకులు త్యాగములు చేసి ప్రాణములర్పించి ఉరికంబమెక్కారు. కఠిన శిక్షలంతా కారగారములో అనుభవించారు. అలాంటి పవిత్ర భావాలతో ఉన్నవారి యింటి గోడలపైన దైవముయొక్క చిత్రాలు, మహనీయుల చిత్రాలు వ్రేలాడుతూ ఉండేవి. కారణం ఏమిటి? ఆనాటి నాయకులు చెప్పినవి చేస్తూ వచ్చారు. చెప్పినవి చేసేవాడు మహనీయుడు. 'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం' ఆనాటి లాల్, పాల్, బాల్ వీరంతా ఎన్నోవిధములుగా జీవితాన్ని అర్పితము చేసి, ఆస్తిపాస్తులంతా త్యాగం చేసి స్వరాజ్యమును సంపాయించారు. అందువల్లనే యువకులలోపల ఆ విశ్వాసం అభివృద్ధి అవుతూ వచ్చింది. కానీ, ఈనాడు అదే యువకుల గదులలో చూస్తే సినీమా పిక్చర్సు ఆడుతుంటాయి గాలికి. ఆ పిక్చర్సుకూడా ఎలాంటివి?

అసభ్యకరమైన పిక్చర్సు. ఈనాటి పిల్లలోకూడా యింత మార్పు కలిగింది చూడండి.

ఏ దృశ్యమును చూస్తామో ఆ భావము మనలో ప్రవేశిస్తుంది. ఏ విషయములు వింటున్నామో అవే మన హృదయములో ప్రవేశిస్తాయి. ముక్కునకు తలుపులు లేవు. తెరువబడి ఉంటున్నాయి. కన్నులకు, నోటికి మాత్రం తలుపులు పెట్టాడు, ఎందుకోసం? ఈ రెండూ చాలా ముఖ్యమైనవి. see no evil, see what is good. నీవు మంచిని మాత్రమే చూడు. చెడ్డ యేమైనా చూస్తే కన్నులు మూసుకో. అలాగే చూస్తూ కూర్చోకు. అలా చూస్తుంటే నీ మైండ్ చెప్తే ఆ ఫ్లాష్ పడుతుంది. ఆ పిక్చరు అలాగే వచ్చి నీలో చేరిపోతుంది. దేహము ఒక కెమేరా. కన్నులు లెన్సులు. బుద్ధి స్విచ్. స్విచ్ వేస్తే చూచేది హృదయంలో పిక్చరుగా పడుతుంది. కనుక, నీవు చెడ్డను చూడవద్దు. దానిని మూసుకో. ఇంక నోటికి మూత పెట్టాడు. నాయనా! మంచిని మాట్లాడు. పరదూషణ చేయవద్దు. పరులను బాధించే మాటలు పలుక వద్దు. అదే ఉద్దేశ్యంతో ఈ పని చేశాడు. తులసిదాస్ కూడా దీనికి ఆదర్శంగా ఒక ఉపమానం చెప్పాడు. రామ్. రా అనేటప్పటికి నోరంతా తెరుస్తాము. అనగా లోపలనున్న రజోగుణం, తమోగుణం అనే రాక్షసులంతా బయట పడిపోతారు. ఆ బయటపడినవి తరిగి లోపల చేరకుండా ఉండటానికి మ్ తలుపులు మూసుకుంటాయి. కాబట్టి, దుర్గుణాలను బయటకు పంపి, బయటపడినవి తిరిగి లోపల చేరకుండా ఉండే నిమిత్తం బంద్ చేయాలి. అదే రా...మ్. ఈవిధమైన పవిత్రమైన ఉపయోగ నిమిత్తమై మనకీ ఇంద్రియాలను యిచ్చాడనే సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. ఈ గుణములు కేవలం యువకులకు మాత్రమే కాదు. ప్రతి మానవునికి అత్యవసరమే. ఈనాడు దేశాభిమానం కోల్పోవటం చేత త్యాగమనేది యేమిటో మనకు అర్థం కావటం లేదు. త్యాగమనేది అర్థం కాలేదు కనుకనే ఆధ్యాత్మిక దృక్పథము మనలో లేకుండా పోయింది.

అన్నింటికంటె ముఖ్యము మనకి ఆధ్యాత్మిక దృక్పథము అవసరం. అది లేకపోతే జీవితమే లేదు. మీరనుకోవచ్చు. మిగతా దేశాల్లోగాని, మిగతా మతాల్లోగాని దైవత్వం గురించి యేమాత్రం ఉచ్చరించరే, వారు ఏమి బాధపడుతున్నారని మీరు ప్రశ్నించ వచ్చు. కానీ, వేరువేరురూపములలో, వేరువేరు నామములతో వారనుభవిస్తున్నారేగాని ఈ ఆధ్యాత్మిక దృక్పథం ఎవరియందు లేకుండా పోలేదు. ఒక చిన్న ఉదాహరణ. ఎప్పుడు చూచినా నేహ్రూ వాళ్ల సాంప్రదాయం ప్రకారం నో గాడ్ అనేవాడు. ఏదైనా ఆశ్చర్యకర విషయం విన్నప్పుడు oh! my God! అని తెలియకుండా అనేవాడు. చూశారా! అది లోపల ఉంది. ఏదో ఆశ్చర్యంతో oh! my God! అంటారు. లేనిది ఎలా వస్తుంది. కానీ కవర్ చేస్తున్నారు. అందరియందు ఆత్మభావం ఉంటుంది. నాస్తిక, యాస్తికనాస్తిక, ఆస్తిక అందరియందు దివ్యత్వం ఉంది. నాస్తికులయందు ఆస్తికత్వం ఉంటుంది. ఆస్తికత్వమే లేకపోతే వాడు నాస్తికుడే కాదు. మీరే చూడండి. నా అస్తి నాస్తి అయింది. అస్తి లేకపోతే నాస్తి అనే పదమే రాదు. అస్తికత్వమనేది దివ్యత్వమే! ఆ దివ్యత్వము నాస్తికత్వముతో కూడి ఉంటుంది. ఇదే ప్రకృతి. ఈ రెండింటి ఏకత్వమే ప్రకృతి. ప్ర కృతి అనగా ఒక ముసంబి ఉంది. దానిలో తీయని రసం ఉంది. పైన చేదు చర్మంతో కప్పబడి ఉంది. ఈ చేదు చర్మం ఉన్నప్పుడే లోపల ఉండే తీపికి ఒక రక్షణ కలుగుతుంది. ఈ చేదు చర్మమే లేకపోతే లోపల స్వీట్ జ్యూస్‌కి ప్రొటెక్షన్ లేదు. నేను డబ్బిచ్చి మోసంబిని కొనుక్కున్నాని చర్మం కూడా తింటామా! లేదు. నీవు కొనుక్కున్నప్పటికీ ఆ చేదు చర్మం తీసి పారవేసి లోపల స్వీట్ జ్యూస్ తీసుకుంటావు. అదేవిధముగా ఈ చెడ్డతో చేరిన మంచి నీ దగ్గర చేరినప్పుడు చెడ్డను దూరము చేసి మంచిని స్వీకరించు. ఇదియే విభాగయోగము. క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమన్నారు గీతలో. విభాగము చేయాలు మనము. అదే discrimination, what is good, what is bad. ఈ discrimination మనలో ఉండాలి. ఈ యువకులలో, ఈ వయస్సులో కొన్ని విచిత్రమైన భావాలు ఆవిర్భవించి ఉంటాయి. భావాలు వచ్చే ముందు మనం యోచన చేసుకోవాలి. నేను మనిషిని, మృగము కాదు అని అనుకున్నప్పుడు నేను మనిషి మనిషిగా జీవించాలి.

చాలామంది పిల్లలు అడుగుతారు, 'స్వామీ! మాకేమాత్రం స్వేచ్ఛలేకుండా ఉంది. పక్షులు యిష్టం వచ్చినట్లు స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. వాటికింత పర్మిషన్ యివ్వటం ఏమిటి? మృగములన్నీ అడవిలో స్వేచ్ఛావిహారము చేస్తున్నాయి. మా స్వేచ్ఛకు మాత్రం అడ్డు తగలటం ఏమిటి?' మీరుకూడా స్వేచ్ఛగా అనుభవించండి. ఐతే ఇక్కడ ప్రశ్న వేసుకోవాలి. పక్షుల స్వేచ్ఛ పక్షులు అనుభవిస్తున్నాయి. మనిషి మనిషి స్వేచ్ఛను అనుభవించాలి. మనిషి మృగము స్వేచ్ఛ అనుభవించకూడదు. కాబట్టి, మనిషిగా నీవు స్వేచ్ఛను అనుభవించు. దానివల్లనే భగవద్గీతలో రెండు ధర్మములని పెట్టారు. స్వధర్మము, పరధర్మము. స్వధర్మమనగా ఆత్మధర్మము. పరధర్మమనగా దేహధర్మము. కానీ, ఈనాటి మానవులు, పండితులు, బ్రాహ్మణులు భగవద్గీత చక్కగా చదివి వివరించి చెప్పేటప్పుడు స్వధర్మము, నేను క్షత్రియుడను, నేను బ్రాహ్మణుడను, నాది బ్రాహ్మణ ధర్మమని వర్ణధర్మములు మాత్రమే ప్రబోధిస్తూ వచ్చారు. ఇది కాదు స్వధర్మమంటే. స్వధర్మమంటే ఆత్మధర్మము. స్వ యిచ్ఛ, స్వేచ్ఛ యిది మరొకటి ఉంది. మీరు యోచన చేసుకోవాలి. మీరు యువకులు. ప్రపంచములో పశుపక్షిమృగాదులంతా ఉంటున్నాయి. వాటికేవిధమైన నిబంధనలు లేవు. కానీ, మనిషికి మాత్రం కొన్ని నిబంధనలు, శాసనాలు ఉంటున్నాయి. చాలా జాగ్రత్తగా యోచించుకున్నప్పుడే ముమ్ముందు జాగ్రత్త పడటానికి అవకాశముంటుంది. వాటికి మేరేజ్ ఎవరైనా చేస్తున్నారా? పక్షులుంటున్నాయి. వీటికంతా engangement, marriage function చేస్తున్నారా? లేదు. అవి స్వేచ్ఛగా వాటిష్టప్రకారము పోతున్నాయి. మనిషికి మాత్రమే ఎందుకీ marriage అనేది నిర్ణయించారు. అనగా ఏమిటి? నాయనా! నీవు మనిషివి. ప్రజ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞానములతో కూడిన వాడవు. ఒక బిడ్డను ఒకడు మాత్రమే కట్టుకోవాలి. ఆమెయే అర్థాంగి.

ఆమెయే గృహలక్ష్మి. ఆమెయే ఇల్లాలు. ఆమెయే ధర్మపత్ని అనే కొన్ని నిబంధనలతో వీరిని కట్టివేస్తున్నారు. కనుక, ఈ నిబంధనలకు తగినట్లుగా యిక్కడ కొన్ని నిర్ణయాలు మనం పాటిస్తూ రావాలి. ఈ నిర్ణయాలకు తగినట్లు కొన్ని సాంప్రదాయాలు మనం అనుసరించాలి. మనిషికి మాత్రమే marriage పెట్టాడుగాని యింక దేనికీ చెప్పలేదు. మనిషికి మాత్రమే కొన్ని punishments పెట్టాడుగాని మిగతావాటికి లేదు. మనిషికి మాత్రమే ఈ law పనిచేస్తుంది. కానీ, వేరేవాటికి law పనిచేయటం లేదు. నీవు తలుపు తెరచి ఉంచితే లోపలికి కుక్క పరుగెత్తుంది. వంటయింట్లోకి పోయి అక్కడున్న వంటలంతా చక్కగా భోజనం చేసి బయటకు వస్తుంది. కుక్కను వీలైతే చిక్కుతే రెండు కొడతారేగాని దీనిని తీసుకొనిపోయి కోర్టుకేసు వేయరు. ఫలాని పక్కింటివాని కుక్క వచ్చి నా యింట్లో భోజనం చేసింది అని రిపోర్టు యివ్వరు. దానికి law కూడా లేదు. కానీ, మనిషికి law ఉంది. law and order మనిషికి మాత్రమే ఉంటున్నాయి. పశుపక్షిమృగాదులకు law and order లేవు. ఈనాడు law and order పోయిందంటే అర్థం ఏమిటి? మనిషిలో ఉండే law and order పోయింది. కనుక, మొట్టమొదట మనిషి అనేవాడు law and order రెండూ ఫాలో చేయాలి. అప్పుడే మనము మనుష్యులుగా తయారౌతాము. ఒక చిన్న విషయం కూడా ఉంది. మృగానికి ఒక విలక్షణమైన జ్ఞానం లేదు. వీటికి discrimination power ఉండవచ్చుగాని సమయస్ఫూర్తిగా అది వినియోగించదు. ఒకడు ఏదో మార్గంలో పోతున్నాడు. ఒక ఇంటి దగ్గరకు పోయేసరికి అక్కడున్న కుక్క వీనిని కరచింది. కరిచేటప్పటికి వాడు కఱ్ఱ తీసుకొని భయం చేత తలపై కొట్టాడు. తల పగిలింది. కుక్క చచ్చింది. యజమాని బయటకొచ్చి చూచాడు. 'ఒరే! నా కుక్కను చంపావా?' అని వానిపై కోర్టులో కేసు వేశాడు. కేసు వేసేటప్పుడు చెపాప్పడీ, 'నా కుక్క నీ కాలు కరచింది. నావెందుకు నా కుక్క తలపై కొట్టావు?' అని వీడు వాదిస్తూ వచ్చాడు. దాని తోకను కొట్టవచ్చు కదా. అంతేకాక నా కుక్క నీ కాలుని కరిస్తే నీవు దాని కాలు కొట్టవచ్చు కదా? తలపై కొట్టవలసిన అవసరమేమిటి? ఇవన్నీ సంకుచితమైన, కుత్సితమైన భావాలతో వేసే ప్రశ్నలే. కాని, నిజంగా మానవత్వంలో ఆవిర్భవించే నీతినిజాయతీలతో కూడినవి కావు. అది ఒక మృగము. ఈనాటి మానవుడు కుక్క కంటె హీనమైపోతున్నాడు.

యువకులు సమాజములో ప్రవేశించాలి. ఎవరైనా సరే నీకు వ్యక్తిగతంగా ద్వేషి కావచ్చు. కానీ, సమాజములో అతనొక వ్యక్తి. సమాజదృష్టితో నీవు అందులో ప్రవేశించాలి. నీవు సమాజములో ఒక వ్యక్తివి. ఒక చెట్టు అడవి కాదు. ఒక ఇల్లు ఊరు కాదు. ఒక్క మనిషి సమాజం కాదు. అనేకమంది వ్యక్తులు చేరినప్పుడే సమాజం అవుతుంది. అనేక ఇళ్లు చేరినప్పుడే గ్రామము అవుతుంది. అనేక చెట్లు చేరినప్పుడే మనము అవుతుంది. నీవు సమాజంలో ఒక మెంబరుగా ఉన్నావు. సమాజ క్షేమమే నీ క్షేమము. నీ క్షేమమంతా సమాజముపై ఆధారపడి ఉంటున్నాది. కనుక, నీవు సమాజ సేవ చేయాలి. సమాజంలో బాధలకు, కష్టములకు, దుఃఖములకు సాధ్యమైనంతవరకు నీ శక్తి మేరకు వారికి సహాయం చేసి ఆ బాధలను, దుఃఖములను, కష్టములను నివారణ చేయటానికి ప్రయత్నించాలి. పదునెనిమిది పురాణాలున్నాయి.

అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనం ద్వయం
పరోపకార పుణ్యాయ పాపాయ పరపీడనం.

ఈ పదునెనిమిది పురాణములు చదవాలంటే సాధ్యం కాదు. ఒకొక్క పురాణం పెద్ద తలదిండు మాదిరి ఉంటుంది. చదవటం సాధ్యం కాదు. కనుక, వ్యాసుడు చెప్పాడు, 'help ever, hurt never. నీవు ఎవరినీ బాధ పెట్టవద్దు. నీవు ఎవరికైనా ఉపకారము చేయి. నీకు ఉపకారం చేయటం చేతకానప్పుడు అపకారం చేయవద్దు. ఇదే పెద్ద ఉపకారం' అన్నారు. కనుక, ఈ రహస్యం గుర్తించి ఎవరినీ సాధ్యమైనంతవరకు బాధ పెట్టకుండా చూచుకోవాలి. నీపై వారు అనేకవిధాలుగా చాడీలు చెప్పటమో, లేక నిన్ను పరిహసించటానికి ప్రయత్నించటమో జరగవచ్చు. దానికి నీవేమాత్రమూ ఉద్రేకుడు కావద్దు. నీ మౌనమే నీకు రక్ష.

పంచపాండవులు అనేక పరాభవములు పొందుతూ వచ్చారు. వారిలో శక్తిసామర్థ్యములు లేకపోలేదు. కావలసినంత శక్తి ఉంది. ఒక్క భీముడు లేచినాడంటే ఒక్క చేతితో పట్టుకొని టెంకాయ కొట్టినట్లుగా కొట్టవచ్చు. అతనిలో లేకపోలేదు శక్తి. ఇంక అర్జునుడు. అతను గొప్ప శక్తివంతుడు. అందువలనే ఎవరికీ లేని టైటిల్సు అతనికిచ్చారు. ఈనాడే అర్జునుడు ఉండివుంటే ఎన్నో పద్మభూషన్‌లు, పద్మశ్రీలు వచ్చి ఉండవచ్చు. అతనికి అర్జున, ఫల్గుణ, పార్థ, కిరీటి, శ్వేతవాహన, భీభత్స, జయకృష్ణ, సవ&.సాచి, ధనుంజయ ఈ బిరుదులంతా పొందాడు. అలాంటి అర్జునుడు కనులు తెరుస్తే చాలు భస్మమైపోతారు. శస్త్రములంతా సాధించిన మహాశక్తి కలవాడు. ఒంటి స్థంభముపైన ఒక సంవత్సరం తపస్సు చేశాడు. ఈ శక్తులంతా వారికి ఎక్కడనుంచి వచ్చాయి? దైవంయొక్క అనుగ్రహమే! అన్ని ఉండినప్పటికీ ధర్మజుడు శాంతి, శాంతి, శాంతి. శాంతముగా ఉండాలి నాయనా. కష్టాలు వస్తుంటాయి. వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోటానికి సిద్ధంగా ఉండాలిగానీ వాటితో పోరాడరాదు. వాటితో పోరాడటం వలన మరింత అధికమైపోతుంది. ఇది మనకు మంచిది కాదు. మనం జూదం ఆడాము. జూదమే పెద్ద తప్పు. తప్పు పని చేశాము. ఆ తప్పుకి తగిన శిక్ష వచ్చింది. నోరుమూసుకొని అనుభవించాలి మనం. దీనికి విరుద్ధంగా తిరగకూడదన్నాడు. ఆ శాంత భావంచేతనే వారు చాలా సౌమ్యంగా నిల్చారు. కట్టకడపటికి ఆ శాంతమే వారి విజయానికి మూల కారణమైంది. అప్పుడు కౌరవులనుకున్నారు, 'వీరంతా ఓడిపోయారు. నిశ్శక్తులైపోయారు. నిర్వీర్యులైపోయారు. వీరికింక చేతకాదు'. చేతకాక కాదు. సమయసందర్భానుసారంగా

ప్రవర్తించాలి. అందువలన నిత్యానిత్య విషయ పరిశీలన జరిపి వారు ప్రశాంతముగా జీవితాన్ని గడుపుతూ వచ్చారు.

ఇలాంటి పవిత్రమైన సమయాలలో మనం హృదయాన్ని చల్లదనం చేసుకోటానికి ప్రయత్నించాలి. వారితో వాదోపవాదం చేస్తూ కూర్చోకూడదు. వాదం చేయటం వలన వైరం పెరిగిపోతుంది. ఒక చిన్న ఉదాహరణ. మీరున్నారు. మీ అందరికీ స్వామి అంటే ప్రీతి. కొంతమంది ఎవరో వచ్చి స్వామిని యేదో అనరాని మాట అనవచ్చు. అప్పుడు నీవు ఉద్రేకుడు కావద్దు. ఒరే పిచ్చివాడా! నీకు తెలియదు. నాకు తెలుసు. నీతో వాదించటం మంచిది కు' అని నవ్వుతూ వెళ్లిపో. అప్పుడు వాడే నోరుమూసుకుంటాడు. ఆవిధంగా వారిని సరైన మార్గంలో తెప్పించాలిగానీ వానితో పోట్లాడుకుంటూ, వీడు పోట్లాడుతున్నాడని యింకా యిద్దరు రావటం, వీరంతా పోట్లాడటం కట్టకడపటికి అసెంబ్లీలో జుట్టుజుట్టు పట్టుకున్నట్లుగా పట్టుకోటం, అపకీర్తుల పాలుకావటం. ఇలాంటి ప్రజా లీడర్సు ప్రజాలీడర్సు కారు. శాంతంగా ఉండాలి. ఆవిధమైన మార్గములో మనము విజయాన్ని సాధించటానికి పూనుకోవాలి. ఒరే పిచ్చివాడా! సూర్యుడు బాగా ప్రకాశిస్తున్నాడు. గుడ్డివానికది కనిపించదు. వాడు లేదులేదు అంటున్నాడు. లేదన్నంతమాత్రాన నీకేమి? నీకు కళ్లున్నాయి. చూస్తున్నావు. వానికి కన్నులు లేవు. చూడలేడు అని నీవు ఎందుకు శాంతపడవు? కన్నులు లేవు, వాడు చూడలేడు. వాని దగ్గరపోయి నీవు వాదన చేస్తే అప్పుడు నీవే గుడ్డివైపోతావు. వానికంటె ఎక్కువ బ్లైండ్ అయిపోతావు. నా కళ్లు నాకున్నాయి. నాకు తెలుసులే పో నాయనా పో. ఒకవేళ వాడు అదేపనిగా కూర్చొని నీతో వాదించవచ్చు. నీవు దేవుడున్నాడంటావు. నీ స్నేహితుడు, 'దేవుడు లేడు, నీవు పిచ్చివడవు, మూర్ఖుడవు' అంటాడు. 'అయ్యా! నీకు లేడు దేవుడు. కానీ నాకున్నాడు. నీ హెడ్డ్, నా హెడ్డ్ రెండూ ఒకటౌతాయా? కాదు. విడివిడిగా ఉంటున్నాయి. కాబట్టి, తలలు వేరుగా ఉన్నప్పుడు తలంపులు వేరుగా ఉంటాయి. నీవు నో అంటావు. నేను ఎస్ అంటాని. అంతేగాని దీనిని నిర్ణయించటానికి అధికారం లేదు. ఒకవేళ నీ దేవుడు నీకు లేకపోవచ్చు. నా దేవుడు లేడనటానికి నావెవరు? నా దేవుడు నాకున్నాడు. దేవుడు ఉన్నాడు లేడు అనటానికి నీకు అధికారం ఉంది. నీ తల్లి నీకెంత ప్రేమనో, నా తల్లి నాకంత ప్రేమ. నీ తల్లిని యేదైన అనరాని మాట అన్నప్పుడు నీకెంత బాధనో, నా తల్లిని అన్నప్పుడు ఆవిధంగా నాకునూ బాధనే. ఈవిధంగా వాని హృదయాన్ని కరగించి సత్యాన్ని వినిపించేటట్లుగా వానికి సమాధానమివ్వాలి. అంతేగానీ మూర్ఖంగా ఉద్రేకపడి మనంకూడా ఒక పిచ్చివానిగా తయారు కాకూడదు.

దీనికంతా మూలకారణము మన యువకులకు సరైన పని లేకపోవటమే. చాలా తెలివితేటలుంటున్నాయి పిల్లలకు. ఈ తెలివితేటలను సరైన పనిలో మనం ప్రవేశపెట్టాలి. మానవునియందు ఎన్నో శక్తిసామర్థ్యములుంటున్నాయి. ఇవన్నీ యింద్రియముల ద్వారా హీనమైపోతున్నాయి. చెడ్డచూపుల వల్ల, చెడ్డవినికిడి వల్ల మన శక్తి పాడైపోతున్నది. అనంతమైన శక్తి. మానవుని దేహముయొక్క ఆయుఃప్రమాణము చాలా తక్కువ. ఈ తక్కువ ప్రమాణములో ఎక్కువ శక్తిని మనం దుర్వినియోగం చేస్తున్నాము. ఈనాటి యువకులు కాలమును చాలా వ్యర్థము చేస్తున్నారు. కాలమును వ్యర్థము చేయరాదు. మన జీవితములో ప్రధానమైనది కాలము. ఆ కాలమును మనం వ్యర్థము చేయటం వలన మన జీవితమే వ్యర్థమైపోతుంది. కాలము ఎవరికీ ఫ్రెండ్ కాదు. కాలము ఎవరికీ గిఫ్టు యివ్వ లేదు. కాలము ఎవ్వరికీ బంధుత్వము కాదు. కాలమును నీవు అనుసరించ వలసినదే గాని కాలము నిన్ను అనుసరించదు. ఎలాంటి వానినైనా కాలము లొంగింప చేస్తుంది. కనుక, కాలమును సార్థకము గావించుకొనే కర్మలలో మనం ప్రవేశించాలి. ఏ కర్మలు? ఏదో ఒక కర్మ చేస్తున్నామంటే కాదు. సమాజములో ఆదర్శవంతమైన కర్మలు చేయాలి. మంచి పిల్లవాడు, మంచి ఆదర్శవంతమైన పిల్లవాడు అని పేరు తెచ్చుకోవాలి. ఎవరినైనా వచ్చి నీ పైన ఎన్నో చెప్పినప్పటికీ 'ఆ పిల్లవాడు అటువంటివాడు కాదు, చెడ్డలో ప్రవేశించడ'నే సార్థకనామం తీసుకురావాలి. ఈ వయస్సు లోపల అనేక ఉద్రేకాలు పొంగి వస్తాయి. ఉడుకు రక్తము. స్పీడుగా వెడుతూ ఉంటుంది. ఈ ఉద్రేకమునకు శాంతమే మంచి పవర్‌ఫుల్ బ్రేక్. శాంతముగా ఉంటుండాలి. దీనికంతా స్వామి ఆదర్శము. my life is my message. ఎంతోమంది ఎన్నోవిధములుగా ప్రచారం చేస్తూ ఉంటారు. దుర్భాషలాడుతూ ఉంటారు. అన్నింటికి నవ్వుతూనే ఉంటాను. దేనికీ జవాబు చెప్పను. ఎందుకు జవాబు యివ్వాలి? తెలియని వానికి జవాబు యిచ్చి ప్రయోజనం ఏమిటి? శాంతములోనే మనకు సౌఖ్యము వస్తుంది. ఒక గుడ్డివాడున్నాడు. గుడ్డివానికి బిడ్డ ఉందట. బిడ్డకు గుడ్డికి సంబంధము లేదు. పెళ్లి చేసుకున్నాడు. గుడ్డివానికి బిడ్డ పుట్టింది. ఇంటిలో పని ఎక్కువగా ఉండటం చేత ఒక సీసాలో పాలు పోసి భర్తకిచ్చి భార్య పనిమీద బయటకు వెళ్ళింది. 'ఏమండి! బిడ్డ యేడ్చినప్పుడు యీ పాలు తాపండి' అంది. 'ఏమిటి పాలంటే ఎట్లా ఉంటాయి' అన్నాడు. 'ఎట్లా వుంటాయి. తెల్లగా ఉంటాయి' అంది. 'తెలుపంటే ఎట్లా ఉంటుంది?' చూడలేడు పాపం. 'కొంగ మాదిరి ఉంటుంది'. 'కొంగ అంటే ఎట్లా ఉంటుంది?' 'ఇట్లా ఉంటుందు' అన్నదట. అప్పుడు చేతులు పట్టుకొని చూచాడట. ఇంత పెద్దది ఆ పిల్లవాని నోట్లో పెడితే వాడు ఏవిధంగా తాగుతాడు?' ఇలాంటి వారి దగ్గర మనము ఎన్ని వర్ణనలు చేసి యేమి ప్రయోజనము. పాలు తెలియదు. తెలుపు తెలియదు. ఏమీ తెలియని వానికి యిలాంటి వికారములు బయలు దేరతాయి. మనము వారితో వాదోపవాదములకు యేమాత్రమూ దిగకూడదు. మన పనులు మనం చేస్తూ పోదాం. వాదనలో దిగి పనులు ఎందుకు పాడుచేసుకోటం?

ఈనాడు ప్రధానమైన విషయము చెబుతున్నాను. ఈనాటి ప్రపంచము చాలా దుర్మార్గముగా, అశాంతిగా అనేకవిధములైన వినరాని మాటలు, వినరాని పనులలోపల ఆవరించింది. అందరికీ జీవితములో భయము యేర్పడిపోయింది. ఎటి& టభయము?

ప్రానమంటే భయము లేదు, కానీ ఏదో భయం. ఆ భయము యేమిటని చెప్పటానికి సాధ్యం కావటం లేదు. వర్ణనాతీతమైంది. ప్రాణంపోతే పోనీ అంటుంటాంగాని భయము ఉంటున్నాది. ప్రానం ఎప్పుడో ఒక తూరి పోయేదికదా! కానీ భయంగా ఉంటున్నాది. ఈ భయము ఏమిటి? అదే కర్మలయొక్క ఫలితము. భయము ఎక్కడ వస్తుంది? తప్పు చేయని వానికి భయమే ఉండదు. మనము యేదో తప్పు చేశము, ఏదో పాపము చేశాము. దాని వలనే భయము వస్తున్నాది. ఈ తప్పు ఏమిటి? ఏమిటి చేయరానిది చేశాము? దీనిని మనం చక్కగా విచారణ చేసుకుంటే నేను మానవునిగా జీవించటం లేదు. కనుక, పెద్ద దోషం యేర్పడిపోయింది. ఈ దోషము వలన భయం యేర్పడుతున్నాది. ధైర్యంగా ఉండాలనుకుంటే మంచి పనులలో ప్రవేశించాలి. ఎట్లా? మన జీవితము ఒక బ్యాలన్సుగా ఉంటున్నాది. బ్యాలన్సు పోయిందంటే జీవితము పనికిరాదు. నడవటం, మాట్లాడటం, పరుగెత్తటం, సైకిలు తొక్కటం అంతా బ్యాలన్సులోనే ఉంటున్నాది. ఏవిధమైన దోషమూ లేకుండా చూచుకోవాలి. ఈనాటి విద్యార్థికిగాని, యువకునికిగాని మంచి బ్రైన్ ఉంటున్నాది. దానిని నాలెడ్జి అన్నారు. నాలెడ్జి పైన ఉంటున్నాది. తలయే టాప్. తలపై ఎలాంటి వెఎంట్రుకలున్నాయి? నల్లని వెంట్రుకలున్నాయి. తిరుపతి వెడుతున్నాము. అక్కడ బోడి చేసుకొని వస్తున్నాము. ఎందుకు ఈ బోడి చేసుకోటం? బోడి చేసుకోటంలో అర్థం ఏమిటి? ఓ భగవంతుడా! ఈ తమోగుణము నా తలపై చేరి తాండవమాడుతున్నాది. తమోగుణాన్ని నీకర్పితము చేస్తున్నానని ఆ నల్లని వెంట్రుకలు గౌరిగించి అతనికి యిచ్చివేయటం. తమోగుణము భగవంతునికి అర్పితము చేసుకునే నిమిత్తమై తిరుపతి వెడుతున్నాముగానీ ఈ బొచ్చు యివ్వటానికి కాదు. కానీ కొంతమంది ఏమి చేస్తున్నారు? బొచ్చు యిచ్చేది, తుచ్ఛమైన కోరికలు తీర్చుకొనేది. భగవంతునికి తమోగుణము అర్పితము చేయాలి. తమోగుణం పోతే నాలెడ్జి ప్రవేశిస్తుంది.

మన దేహములో ఒక కరెంటు ఉంటున్నాది. కరెంటు వెంట్రుకల ద్వారా, గోళ్ల ద్వారా, దేహము ద్వారా సర్వత్రా వ్యాపించి ఉంటున్నాది. ఇది చాలా పవర్‌ఫుల్. దీనిని చక్కగా తెలుసుకున్న సైంటిస్టులు యోచన చేస్తే మన దేహమంతా కరెంటే. ఈ కరెంటు సవ్రత్రా వ్యాపించి ఉంటున్నాది. ఈ నాలెడ్జి మెయిన్‌స్విచ్ వంటిది. నాలెడ్జిని చక్కగా వినియోగించుకోటమే స్కిల్ అన్నారు. నాలెడ్జిని స్కిల్ చేసినప్పుడు బ్యాలెన్సు కరెక్టుగా ఉంటుంది. కానీ, ఈనాటి యువకులు నాలెడ్జిని స్కిల్ చేసుకోకుండా కిల్ చేస్తున్నారు. ఈ కిల్ చేయటం వలనే బ్యాలెన్సు తప్పిపోతున్నాది. ఈ బ్యాలెన్సు తప్పిపోవటం వలనే యాక్సిడెంట్సు జరుగుతున్నాయి. యాక్సిడెంటు అంటే ఏమిటి? అశాంతి జరుగుతున్నాది. మొట్టమొదట ఈ నాల్డ్జిని సద్వినియోగ పరచుకోవాలి. ఇది ఏవిధంగా? పవిత్రమైన దైవ కార్యములలో ప్రవేశపెట్టాలి. దైవకార్యములలో ప్రవేశపెట్టి నప్పుడు సమాజముయొక్క శక్తికూడా మనలో ఆవిర్భవిస్తుంది. ఆత్మవిశ్వాసము పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసముతో కార్యములు చేయాలి. ఏ పని చేసినప్పటికీ మాటలు లేని పని చేయాలి. మాటలు చెప్పే పెదవుల కంటే చేతులతో చేసే పని చాలా గొప్పది అన్నారు. నోటితో చెప్పే భజనలకంటే చేతులతో చేసే దానం గొప్పది. కనుక, చేతులకు దానమే అందము. కంఠమునకు నామమే అందము, నెక్లెస్ కాదు. భగవన్నామము శ్రవణం చేయటమే అందము చెవికి. ఇలాంటి తీరని అందములు, విలువైన అందములు ఉంటున్నప్పటికీ తుచ్ఛమైన, స్వల్పమైన నగలు ఎందుకు కోరాలి? 'హస్తస్యభూషణం దానం, కంఠస్యభూషణం నామం' ఇలాంటి భూషణాలు ఉంటున్నాయి మనకు. ఈ భూషణములకు మనం దూరమైనాము. కాబట్టే, దూషణాలు వస్తున్నాయి. ఇలాంటి చెడ్డవాడు, అలాంటి చెడ్డవాడు అనే దూషణ వస్తున్నాది మనకు.

యువకులలోపల ఉండే శక్తి చాలా గొప్పది. ఈ శక్తిని అందరూ ఏకభావము చేసుకున్నప్పుడు మనలో ఒకవిధమైన విద్యుత్‌శక్తి అధికమైపోతుంది. ఎట్లా? ప్లస్, ప్లస్, ప్లస్...అయినప్పుడు ప్లస్ అయిపోతుంది. ఇక్కడ చేరిన వారందరూ ఒక కార్యములో ప్రవేశిస్తే ఎంతైనా మనం సాధించవచ్చు. మన ఎం.బి.ఎ. విద్యార్థి చెప్పాడు. ఆనాటి రాములు కోతులచే బ్రిడ్జి కట్టించి, రావణుని సంహరించి రాముడు విజయాన్ని సాధంచాడు. ఈనాడు ఈ ప్రోజక్టులోపల కోతులవలె పనిచేయాలని. కోతులవలె పని చేయనక్కర లేదు. కోతులు చేసిన పని ఒకటుంది. రాళ్లు కొండపోయి పడవేస్తే మునిగిపోతూ వచ్చాయి. ఏవిధముగా తేల్చాలి అని యోచన చేసాయి. కోతులకు, మానవులకు ఉన్న వ్యత్యాసము ఏమిటి? వానర..నర. నరుడు, వానరుడు. వాలము ఉండేది వానరము, లేనిది నరుడు. బాగా యోచన చేసాయి. ఈ జలములో మునగక తేలేది ఏమిటి? భగవన్నామము మునిగేది కాదు. మన ఈ సంసారమనే సాగరములో భగవన్నామము మునగదని ఒక్కొక్క దానిపై 'రామ్, రామ్' అని వ్రాసి సముద్రములో పడవేసారు. ఒకొక్కక్క రాయి ఒక్కొక్క వైపున వెళ్లిపోయింది. అలలు అటువైపునా, యిటువైపునా కొట్టివేసాయి. తేలినాయిగానీ ఎట్లా నడిచేది? అక్కడొక రాయి ఉంది. ఇక్కడొక రాయి ఉంది. మరల యోచన చేశాయి. అప్పుడు ఒకదానిపై 'రా', మరొదానిపై'మ' అని వ్రాసాయి. అప్పుడు రెండూ కలుస్తూ వచ్చాయి. అప్పుడా సముద్రము దాటారు. ఈ discrimination ఎంత గొప్పది. అలాంటి discrimination మానవునికి ప్రధనమైన పెట్టిన వరము. ఆ discrimination సరైన మార్గములో ప్రవేశపెట్టాలి. అందరికీ ఉపకారమైన కార్యములలో మనము ప్రవేశించాలి. ఎన్ని పనులు చేసినా యిదంతా దైవకార్యముగా భావించండి. దీనిని పురస్కరించుకొనియే సర్వకర్మ భగవత్ప్రీత్యార్థం అన్నారు. work will be transformed into worship నోటితో భగవన్నామము, చేతులతో భగవత్కార్యము.కేవలం పెదవులతో పలికితే మాత్రం ఫలితం కాదు. హృదయం నుంచి రావాలి. మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం అన్నారు. మీరు ఏ పని చేసినా హృదయపూర్వకంగా చేయండి. ఐతే ఆ పని చేయటానికి పూర్వం ఇది మంచా, చెడ్డా అని విచారణ చేయాలి. ఈవిధంగా

ఉంటుంటే ఈనాడు చెలరేగిన అశాంతి మన భారతదేశములో అతి శీఘ్రముగనే చల్లారిపోతుంది.

ఈ ప్రపంచములో వినరానివన్నీ జరుగుతున్నాయి. అమలాపురం దగ్గర భూమినుండి అగ్ని పొంగిపోతున్నది. ఇదంతా దేని రిజల్టు? ఈ సైన్సు రిజల్టు. ప్రపంచములో భగవంతుడు ఏఏ దానికి ఎంతపవరుండాలో ఆ పవరు సృష్టించి పెట్టాడు. కానీ, మనిషి స్వార్థస్వప్రయోజనముల కోసమని భూమిలో ఉండవలసిన వనరులు బయటకు తీస్తున్నారు. భూమి గోళము. ఒకవైపున రిజర్వాయర్లు కడుతున్నారు. ఇంకొక వైపున దొలిచివేస్తున్నారు. ఒకవైపున డొల్ల ఉండి మరొకవైపున బరువు ఉంటున్నాది. దీనివల్ల భూమి బ్యాలెన్సు తప్పుతున్నాది. భూమిలో ఏఏ పదార్థములు ఎంతంత ఉండాలో అంతంత ఉండాలి. ఈ వనరులు తీసేస్తున్నారు. ప్రపంచానికి యేమి ప్రమాదము యేర్పడుతదని విచారణ చేయటం లేదు. నా పేరు ప్రఖ్యాతులు కావాలి. ఫలాని సైంటిస్టు యిలాంటి పని చేశాడు. పేరుకోసం చేస్తున్నాడేగానీ ప్రజలకోసం చూడటం లేదు. ఇక్కడ ఆయిల్ ఉండాలి. ఇక్కడ ఖనిజ సంపత్తు ఉండాలి. అని భగవంతుడు చక్కగా సృష్టించాడు. అంతా తీసివేస్తున్నారు. దీని వలనే ప్రకృతి వైపరీత్యము అధికమవుతున్నది. శృతి మించుతున్నాది ప్రకృతి. తగిన శాంతి పరచే ప్రార్థనలు ఎక్కడా జరగటం లేదు. నిజముగా నిమ్మినా నమ్మకపోయినా భగవత్ప్రార్థన హృదయపూర్వకంగా జరుపుతే యిలాంటివి జరగటానికే వీలులేదు. ప్రజలు యిలాంటివి జరిగినప్పుడు అయ్యో! ఇలా జరిగింది, అలా జరిగింది అని వాపోతారుగానీ భగవదనుగ్రహము ఉంటే ఎంత మాత్రమని భగవచ్చింతన చేయకూడదా! నిరంతరమూ భగవత్ప్రార్థన చేస్తే దాని వల్ల జరగనిది ।క్కటీ లేదు. సర్వమూ విజయాన్ని సాధిస్తారు. ఏఏ పదార్థము ఎక్కడెక్కడ ఉండాలో అక్కడక్కడ ఉండాలి. సైన్సు అభివృద్ధి కావలసిందే. ఎంత వరకో అంత వరకేగాని మితిమీరిపోకూడదు. మితిమీరిపోవటం చేత ప్రకృతి మారిపోతున్నాది. ప్రకృతిలో ఎలాంటి మార్పూ రాకుండా ఉత్తమమైన స్థితిలో ఉండేటట్టు మనం ప్రార్థించాలి. మీరు చేయవలసింది ఒక్కటే. ఏ కార్యము చేసినా భగవత్కార్యముగా భావించి చేయండి. ఆఫీసుకుపో, నీ పని నీవు చేయి. పెండ్లి చేసుకో కావలసినంత అభివృద్ధికి రా. అంతేగానీ యివంతా మానమని నేను ఎప్పుడూ చెప్పను. మితిమీరి మాత్రం పోకూడదు. మితిమీరి పోయినప్పుడు కొంత వరకు మతి చెడుతుంది.

కొంతమంది ఉంటుంటారు. ఎప్పుడు చూచినా పెండ్లి, పెండ్లి. పెండ్లి పిచ్చి ఉంటుంది పాపం. చేసుకో. ఇష్టమైతే ఎవరు వద్దంటారు. కానీ, తగినంతలో జాగ్రత్తగా ఉండాలి. పెండ్లి చేసుకున్న మూడు నెలల వరకు వైఫ్ ఈజ్ లైఫ్ అంటావు. తరువాత వైఫ్ ఈజ్ నైఫ్ అయిపోతుంది. ఇవన్నీ ప్రమాదాలు జరిగేవి. వారికి అర్థము కావు. ఏవో తుచ్ఛమైన అల్పసుఖాల కోసమని అనేక కోరికలు కోరుతుంటాము. ఇష్టము లేకపోతే మాత్రం బలవంతము చేయకూడదు. నిగ్రహించుకునే శక్తి మీలో సంపా.తించికోవాలి. నిజంగా నిగ్రహములో నున్న అనుగ్రహం ఎంతో చెప్పటానికి వీలులేదు. మనము మంచిని నడచుకొని పిల్లలకు, పెద్దలకు అందరికీ ఆదర్శము నిరూపించాలి.

మీరు యిప్పుడు మీటింగు పెట్టుకొని రాయలసీమలో వాటర్ సప్లై చేసేదానిలో సేవ చేయలని అనుకుంటున్నారు. నాకు వాంఛ లేదు. ఈ పరిమితమైన సేవ నాకు యిష్టము లేదు. జీవితము ఉండినంత వరకు పనిచేయాలి. మనం వచ్చినది కర్మ చేయటానికే. కేవలం ఈ ప్రోజక్టు మాత్రమే మనం చేయటం కాదు. ఎక్కడికైనా మీరు వెళ్ళండి. ఎక్కడైనా ఉండండి. సమాజ సేవ చేయండి. ఎక్కడ ఏది అవసరమో అక్కడ నీవు ప్రవేశించు. నీవు ఆఫీసుకు పోతుంటావు. ఎవరో బాధ పడుతుంటాడు. అక్కడ ఆనాడు లీవు తీసుకొని హాస్పటలుకు తీసుకుపో. అది త్యాగముతో చేయవలసిన క్షేమం. ఐతే నీకు ప్రమాదం జరిగేది చేయకూడదు. నీకు ప్రమాదము లేకుండా యితరులకు ప్రమాదము తప్పించే ఉపాయము నీవు నేర్చుకోవాలి. అందువలనే తాను ఎవరిని నొప్పించకుండా, తాను నొప్పి పడకుండా తప్పించుకోవాలి. తప్పించుకోటం అంటే యుక్తిని మనం ప్రవేశపెట్టకూడదు. జీవితంలో పనులు చేయటం చాలా అవసరం. ఏ పని లేకపోతే మీ యింటి పని మీరు చేయండి. చదువుకున్నవాడివి కదాయని అహంకారమునకు అవకాశము యివ్వకూడదు. ఈ అహంకారమే మానవుని యింత అధఃపతనము చేస్తున్నది. వరండాలో ఛైర్‌పైన కూర్చొని చదువుతున్నావు. నీ తండ్రి అక్కడ కట్టెలు కొడుతున్నాడు. కండ్లతో చూస్తున్నావు. ఇది సరైన ధర్మము కాదు. 'తండ్రి ఆ పని చేస్తుంటే నేను ఈవిధంగా ఉండటమా ఛీ' అని పుస్తకము అక్కడ పెట్టాలి. 'నాయనా! నీవు కూర్చో. నేను దానిని పగలకొడతాను'అని సహాయము చేయాలి. అప్పుడు తండ్రి ఎంత ఆనందిస్తాడు. లోలోపల ఎంత సంతోషిస్తాడో మీకు అర్థము కాదు. తల్లిదండ్రులకు ఆనందమునివ్వకుండా నీవు ఆనందము ఎట్లా అందుకోగలవు? కనుక, మొట్టమొదట తల్లిదండ్రులకు ఆనందమునందించాలి. అప్పుడు సహజంగా నీకానందము కలుగుతుంది. ఈరకమైన సేవలో మీరు పాల్గొనాలి. అదే నిజమైన సేవ. అదే నిజమైన భక్తి.

నేను అప్పుడప్పుడు చెబుతుంటాను. మాత, పిత, గురు,దైవమని. నాల్గింటిని వరుసగా పెట్టారు. తల్లి,గురువు, తండ్రి, దైవమని పెట్టవచ్చు కదా? కాదు కాదు. మన ప్రాచీన సాంప్రదాయములోనున్న స్వానుభవములు ఎంతో స్పష్టమైనవి. అర్థవంతమైనవి. ఆదర్శవంతమైనవి. నవమాసములు మోసి కని, పెంచినది తల్లి. ఆ తల్లిని నీవు మొట్టమొదట గుర్తించిన తరువాత తల్లే తండ్రిని చూపుతుంది. 'బాబూ! అదుగో నీ తండ్రి' అని చూపుతుంది. కాబట్టి తండ్రిని చూపునది తల్లి. తండ్రి ఎవరిని చూపుతాడు? తండ్రి గురువును యేర్పరుస్తాడు. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవాన్ని చూపుతాడు. ఇదే ప్రహ్లాదుడు చెప్పినది. తండ్రి హరి చేరుమనియెడి తండ్రి, తండ్రి. ఒకరిని ఒకరు చూపినవారు కనుక, వారికి మన కృతజ్ఞత అందించాలి.

ఎందుకు కృతజ్ఞత అందించాలి? చాలామంది అనుకుంటారు,'నేను ఆఫీసరును. చదువుకున్నాను. పెద్దవాడనయ్యాను. ఇంకా తల్లిదండ్రులను ఎందుకు గౌరవించాలి? నీవు పెద్దవాడివే. గొప్పవిద్యావంతుడివే. మంచి శరీరము పెంచుకున్నవాడివే. తండ్రి బలహీనుడుగా ఉంటాడు. ఆ బలము చూచికాదు నీవు బలవంతుడను అని అనుకోటం. ఎంత గొప్పవాడైనా తండ్రికి కొడుకే. దాంట్లో యేమాత్రం నీవు గొప్పవాడు కాదు. అంతేకాదు. నీ బ్లడ్, నీ దుడ్డు, నీ హెడ్డ్ అంతా పేరెంట్సు గిఫ్టే. పేరెంట్సు వలనే నేను యింతవాడినయ్యానని వారికి కృతజ్ఞత యివ్వాలి. ఈనాడు నీవు నీ తల్లిదండ్రులకు కృతజ్ఞత నిస్తే రేపు నీ పిల్లలు నీకు కృతజ్ఞత చూపిస్తారు. తల్లిదండ్రులుకూడా ఆవిధంగా లేరు. అదృష్టవశాత్తు స్వామి సన్నిధి చేరుతున్నారు. స్వామి వాక్యములు విని యింతకు పూర్వము లేని మంచిగుణములు పెంచుకొని తల్లిదండ్రులకు ఆనందమునిచ్చే సేవ నీవు చక్కగా చేస్తే వారి హృదయం కరిగిపోతంది. అప్పుడే వారి ఆశీర్వాదము హృదయపూర్వకంగా మీకు అందుతుంది. తద్వారా మీరెంతో అభివృద్ధి పొందుతారు. తల్లిదండ్రులను బాధపెట్టే పనులుయేమాత్రమూ చేయకూడదు. తల్లిదండ్రులకు యిష్టము లేని పనులు చేయవద్దు.

మొట్టమొదట యిష్టడి నేను ఆ అమ్మాయిని చేసుకునే తీరాలి. తల్లిదండ్రులు ప్రాచీనులవటం వలన 'వద్దు, మన caste కాదు' అని చెబుతారు. అప్పుడు మనం ఏమి చేయాలి? టైము తీసుకో. వాదన చేయి. చక్కగా వివరించి చెప్పు. నా మనసు యిలా ఉంటున్నాది. కాబట్టి యిష్టము లేనిది నేను చేసుకొని జీవితములో యేమి సుఖాన్ని పొందుతాను' అని క్రమక్రమేణా వాళ్ళకు నచ్చ చెప్పటానికి ప్రయత్నం చేయాలి. కానీ వాదోపవాదములు వేసుకొని బయటకు పోయి ఆ అమ్మాయని పెండ్లి చేసుకొని వేరొక యింట్లో ఉంటుంటే నీ గతి యేమిటి? కాదు. నీ తల్లిదండ్రులను నొప్పించి మాత్రం యే పనీ చేయకూడదు. వారిని మెప్పించి యేమైనా చేసుకో, సంతోషం. వారికిష్టం లేనిది నాకు మాత్రం యేమిటి యిష్టం. అని నీకు నీవే సవరించుకోవాలి. కొంత టైము తీసుకో. అన్నీ మారిపోతాయి. వచ్చే thoughts అంతా temporary, passing clouds, not permanent clouds. టైము తీసుకో. అప్పుడే చక్కగా నీకు మనశ్శాంతి కుదురుతుంది. ఇంట్లో వాదన వేసుకొని పరాయి యింట్లో కూర్చొని ఉంటే వారికి బాధ, నీకు బాధ. ఇలాంటి కట్టుబడుల లోపల రెండు కుటుంబాలు బాధపడకూడదు. ఇలాంటివి చేస్తే ఏమవుతుంది? తిత్తి బోడి, నెత్తి బోడి తిరుపతికి పోనక్కరలేదు అని. వారు కష్టంగా ఉన్నారు. నీవు కష్టంగా ఉన్నావు. ఏమిటి దీనివలన వచ్చిన సుఖము? పెండ్లి విషయములో యేమాత్రమూ యిలాంటి పట్టుదలలు పట్టకూడదు. చేసుకోవద్దని నేను చెప్పను. పెండ్లి చేసుకొండి. ఆనందముగా జీవించండి. ఆదర్శ జీవితాన్ని గడపండి. రెండు చేతులతో చేస్తున్న సేవ నాలుగు చేతులతో చేయండి. తప్పు లేదు. కానీ, తల్లిదండ్రులను సాధించి చేయకూడదు. ఒకవేళ నీకు యిష్టము లేనప్పుడు వారు నిన్ను బాదించకూడదు. ఈ రెండింటి సమన్వయమే నిజమైన మానవత్వమునకు సరైనది. అప్పుడే మనకు బ్యాలెన్సు కుదురుతుంది.

యువకులారా! ఈ వయస్సు golden age. ఈ వయస్సులో అరక్షణమైనా మనము వ్యర్థము చేయకూడదు. ఏదో ఒక పని చేస్తూ రావాలి. పరోపకార సంబంధమైన పనులు చేయాలి. ఈ పనులు నేను చేశానని అహంకారమునకు చోటివ్వకూడదు. అహంకారము నశింపచేసుకునే నిమిత్తము సేవలలో మనం ప్రవేశించాలి. అనేకమంది సేవాదళములో ఉంటుంటారు. ఎవరైనా పోరాని స్థలములో పోతుంటే చెప్పండి, 'సార్, ఈ త్రోవ కాదు, వేరొక త్రోవలో వెళ్ళండి' అంటే 'ఫో, ఫో, నీవు యేమి చెప్పేది' అని వారు నెట్టి వారు పోతుంటారు. అప్పుడు కూడా నమస్కారమే చేయి. 'ఇది కాదు సార్, యిలా పొండి' అని ఒక తూరి, రెండు తూర్లు నమస్కారము చేసి మంచి మాటలతో చెబితే వానికే సిగ్గవుతుంది. తల వంచుకుంటాడు. మన ప్రవర్తన చాలా గొప్పదిగా ఉండాలి. అదే డిసిప్లిన్. మన ప్రవర్తన బట్టి మన జీవితము భవిష్యత్తులో గొప్ప స్థితి పొందుతుంది. ఈవిధంగా మీరు చాలామంది యువకులు చేర్చాలి. యువకులంతా ఒక్కటైతే భారతదేశము కొన్ని క్షణాల్లో మంచిగా మార్చివేయవచ్చు. ఊరంతా ఒక్కటైనప్పుడు చేనంతా అరక్షణంలో కోసేస్తారు. కలయిక రావాలి మనలో. ఐకమత్యము. యూనిటీ ఉండినప్పుడే ప్యూరిటీ ఆవిర్భవిస్తుంది. ప్యూరిటీ వచ్చినప్పుడే డివినిటీ ఆవిర్భవిస్తుంది. డివినిటీ వచ్చినప్పుడు కమ్యూనిటీ మర్చిపోతాం. ఈ కమ్యూనిటీ మనం తీసుకోకూడదు. ఏ కులమైనా సరే, ఏ మతమైనా సరే.

కొన్నికొన్ని వాక్యాలు పిల్లలు పట్టుకొని, caste of humanity, ఏ caste అయినా పరవాలేదు పెండ్లి చేసుకుంటాను అనుకుంటాడు. నిజమే, caste ఒకటేగాని కల్చరు? నీవు బ్రాహ్మణుడుగా ఉంటున్నావు, మహమ్మదీయుని పెండ్లి చేసుకుంటున్నావు. caste of humanity అంటావు. మంచిదే చేసుకోవచ్చు. రేపు ఆ అమ్మాయి మాంసము తింటుంది, నీవు తినవు. నీవైనా ఆమెకు దాసుడు కావాలి లేక ఆమె అయినా నీకు దాసురాలైపోవాలి. అక్కడ జరుగుతుంది కల్చరులో విభేదము. ఇది నాకు యిష్టము లేదని అంటుంది ఆ అమ్మ, ఎట్లా వదిలేదని యీయన అంటాడు. కొరియా వార్ స్టార్ట్ అవుతుంది. కనుక, caste తో బాటు కల్చరుకూడా మనం చూడాలి. రెండూ లేకుండా పోతే మనం మృగాలే! పెండ్లి చేసుకోండి. తప్పు లేదు. రాజ మార్గమే. అనవసరంగా ఈ మార్గం, ఆ మార్గం పోయి చెడ్డ పేరు తెచ్చుకునే బదులు పెండ్లి చేలుకుని ఆదర్శవంతమైన జీవితాన్ని గడపండి. కొన్ని thoughts ని జాగ్రత్తగా పెట్టుకోండి. ఈనాటి యువకులలో అర్థము కాని thoughts బయలుదేరుతున్నాయి. మనము ఎక్కడకో పోతుంటాము. మన ప్రవర్తన ఎట్లా ఉండాలంటే, పెండ్లి కాక పూర్వము అందరూ sisters. పెండ్లి అయిన తర్వాత ఒక్క person మాత్రం wife. దేహానికి దేహం

wife. అందులో యిందులో ఆత్మ ఒక్కటే. అక్కడ యూనిటీని తీసుకోవాలి. అందువల్లనే యూనిటియే ప్యూరిటీ. ప్యూరిటీయే డివినిటీ. అదే తీసుకోవాలి. అంతేగాని ఏమెను చేసుకోవాలి, ఈమెను చేసుకోవాలి ఇలాంటి పిచ్చిపిచ్చి భ్రాంతులంతా రాకూడదు. అది మనకు తెలియకుండా పాప పర్వతం పెరిగిపోతూ ఉంటుంది. అలాంటి thoughts మనలో ప్రవేశించకూడదు. ఛీ! నాకు ఇలాంటి thoughts వచ్చినాయి, చిన్న ఉదాహరణము. నీకు sister ఉంటుంది. నీ sister ను పరాయివాడు అపహాస్యము చేస్తే నీకు ఎంత బాధ అవుతుంది. ఇంకొక వ్యక్తిని మనం అపహాస్యముగా, అసభ్యముగా ప్రవర్తించినప్పుడు వారి brothers ఎంత బాధ పడతారు ఇలాంటివంతా మంచిది కాదు. పాపమంటే ఇది. 'పాపమనగా పరదేశమున లేదు, తాను చేయు పనుల తగిలియుండు' ఈవిధమైన భావమును మనం పెంచుకోవాలి. అందరినీ ప్రేమతత్త్వంగా చూచుకోవాలి. ఈ సమత్వం మనం పెంచుకుంటే యింతకంటె గొప్ప తపస్సు, యింతకంటె గొప్ప సాధన యింకొకటి లేదు. ఐతే, మన పిల్లలు మాటలు కొంచెం తగ్గించుకోండి. less talk more work. అనవసరంగా మాట్లాడి మన శక్తిని పాడుచేసుకోరాదు. ఇంతేకాక స్త్రీల విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి.

ఇక్కడ మీరంతా చేరినారు కనుక యింకొకటి కూడా మీకు జ్ఞాపకం చేస్తున్నాను. ఇప్పుడు కొన్ని నివారణకాని జబ్బులంతా అభివృద్ధి అవుతున్నాయి. ఇలాంటి జబ్బుల వల్ల ప్రపంచమే చాలా నాశనమవుతుంది. కారణం ఏమిచి? ప్రవర్తన సరిలేని వారికే యిలాంటి జబ్బులు ప్రారంభమవుతాయి. మీకు తెలుసు. aids చాలా ప్రమాదమైంది. దగ్గర ఉంటేనే ఆ జబ్బు మనకు తగులుతుంది. బట్టలు తగిలితే చాలు మనకి వచ్చేస్తుంది. ఇలాంటి చెడ్డ జబ్బులు భారతదేశంలో కూడా కొన్ని వందలు తయారౌతున్నాయి. మీరు అతి జాగ్రత్తగా ఉంటుండాలి. ప్రవర్తనలు పవిత్రంగా పెట్టుకోవాలి. రెండు మూడు రక్తముల చేరిక చేత యిలాంటి జబ్బులు బయలుదేరతాయి. character is 3/4 th of life అన్నారు. ఆ character పోగొట్టుకొన్న వారికి ఇలాంటి జబ్బులు వస్తాయి. ఆ సమయంలో వారికి యేమాత్రమూ తెలియకుండా పడిపోతారుగానీ తదుపరి చాలా అవస్థలకు గురౌతారు.

ముందున్నదిరా తొందరలోనే ముసలితనమ్మును ముసుళ్లపండుగ
తైతై తైతై తైబొమ్మా దీని తమాష చూడర మాయబొమ్మ

ఇదా మనము సాధించవలసిన తమాషా! ఇది తమాషా కాదు. ఇది ప్రమాదకరమైనది. ఇలాంటి దీనిలో మీరు జాగ్రత్త పడండి. ఇలాంటివి యితర స్నేహితులకు బోధించాలి, 'పిచ్చివాడా! నీవు యిలా ప్రవర్తించకూడదని.' మీరందరూ మంచి ప్రవర్తనలో ఉండి మంచి పేరు తెచ్చుకొని ఆయురారోగ్యముతో చక్కని కీర్తిని సంపాయిస్తే అదే నాకు కావలసింది. నాకు యింకేమీ వద్దు. మీరు పని చేసినా, చేయకపోయినా మీ తల్లిదండ్రులను ఆనందపెట్టండి. మీరు ఆరోగ్యంగా ఉండండి. ఆదర్శ విద్యార్థులుగా ఉండండి.

70th birthday అనేకరకములైన సేవలు ఉంటుంటాయని మీరు అనుకుంటున్నారు. నా రహస్యముకూడా చెబుతున్నాను. నాకు ఎప్పుడూ రహస్యము లేదు. మీరు అనుకోవచ్చు స్వామికి ఎవరైనా సేకరెట్రీ ఉన్నాడా అని. ఎవరికి సెకరెట్రీ కావాలి? secrects ఉన్న వానికి secratry కావాలిగానీ నాకు no secrects, no secretry. నాకు ఎవరూ లేరు. ఇంత వరకు నేను ఎవరినీ చేయి చాచి అడగలేదు. సత్సంకల్పమే సర్వమును ఏర్పరుస్తుంది. మీరు కూడా సత్సంకల్పము చేయండి. తప్పక మీ కార్యము నెరవేరుతుంది. పోయిన birthday సమయంలో రాయలసీమలో నీటికై బాధలు పడుతున్నారు, వారికి నేను ప్రోమిస్ చేశాను.జోగారావు చెప్పాడు,' స్వామీ! 200 కోట్లు అన్నారె మీరు. ఇది చాలదు. మన దగ్గర లేదు. ఏదైనా మార్గము స్వామి సంకల్పించాలి' అన్నాడు. 'భక్తుల కోసం తప్ప నా కోసం ఏనాడూ సంకల్పించ' నన్నాను. మన భారత దేశములో మంచి కార్యములు ప్రారంభిస్తే దేనికి కొరత లేదు. మన భారతదేశము ఐశ్వర్యవంతమైనది. అనేకమంది మీరనుకోవచ్చు, బీదదేశమని. చాలా పొరపాటు. విద్యార్థులారా! భారతదేశ ఐశ్వర్యము మరే దేశములోనూ లేదు. నిజంగా భారతదేశము బీద దేశమైతే ఎందుకు ఫ్రెంచివారు, తురుష్కులు, బ్రిటీషువారు దండెత్తి వచ్చారు? ఎంతో సంపద ఉండటం వలనే వచ్చారు. ఎంతోమంది ఎన్ని పర్యాయములు దీనిపై దండెత్తి వచ్చారు? ఏమీ లేకపోతే ఎందుకు దండెత్తి వస్తారు? కావలసినంత ఉంది. మీ దృష్టి లోపల యేమీ లేనట్టుగా కనిపిస్తున్నాది. మనకేమీ తక్కువ లేదు. ఎవరినీ అడగకూడదని ట్రస్టువారికి నేను చెప్పాను. ఎవరైనా అడిగినట్లు తెలిస్తే తక్షణం తీసేస్తానన్నాను. ఎవరి దగ్గర డబ్బు తీసుకోకూడదని చెప్పాను. ఎవరికీ తెలియదు. నేను చెబుతున్నాను. జర్మనీ వారు వచ్చారు. 'స్వామీ! మూడువందల గ్రామములు మేము తీసుకుంటామన్నారు. జపానువారు వచ్చారు. వారు 200 గ్రామములు తీసుకుంటామన్నారు. మలేషియా ఆయన 400 గ్రామాలు తీసుకుంటానన్నాడు. ఆస్ట్రేలియావారు నూరు గ్రామాలు తీసుకుంటామన్నారు. నాకు వారికి heart to heart connction. కానీ డబ్బుతో పెట్టుకోలేదు. వారు దీన్ని కడతారు. నీరు సప్లై చేస్తారు. ఇట్లు చాలా అధికమౌతూ వచ్చింది డబ్బు. అందువల్ల నిన్న తుంగభద్ర డామ్ వద్దకు పోయి, పెన్నారు డామ్‌కి పోయి చూశాము. ఈ బోర్‌వెల్సులో కొంతకాలము నీరు రావచ్చు, కొంతకాలము పోవచ్చు. చిన్నచిన్న గ్రామములకు బోర్‌వెల్సు వెసేతీరాలి. అదికూడా శాశ్వతముగా చేయాలని నా ఉద్దేశ్యము. కాలువ తవ్వాలని గవర్నమెంటువారు ఆదేశించారు. మీకు తెలుసీ గవర్నమెంటు పనులు. ఆ ప్లానులు నేను అంగీకరించలేదు. కాలువలు తవ్వుతారు. కాలువల ద్వారా మంచినీరు తెస్తారు. త్రాగునీటి కాలువలలో ఎంత పొల్యూషన్ అయిపోతుంది. ఇప్పుడే గాలి, నీరు శబ్దము పొల్యూషన్ అయింది. త్రాగే నీరును అపవిత్రం చేయటం నాకిష్టము లేదు. ప్రక్కన కాలువ పోతుంటే ఈ ప్రక్క భూమివాడు, ఆ ప్రక్క

భూమివాడు పంపులు వేసుకొని నీరు లాగేస్తారు. వాటర్ వేస్టు చేయటం యిష్టం లేక భూమిలోపల తవ్వి నీరు తెచ్చి అన్నింటికీ సప్లై చేస్తున్నాము. అనంతపురం జిల్లాలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంటున్నాది. అది లేని దగ్గర మనం వేయాలి. ఎక్కడ వేసినా తీయటి నీరు వస్తుంది. ఏమిటి దీనికి కారణము? తీయని మనస్సుతో చేస్తున్నాం కనుక తీయని నీరు. యద్భావం తద్భవతి. మన భావము ఎట్టిదో ఫలితము అట్టిది. పార్లపల్లె నుంచి పైపులు వేస్తున్నాం.

ఇప్పుడు మీరు చేయవలసిన పని యేమంటే కాలువ తవ్వనక్కరలేదు. పైపులు యిబ్బంది లేకుండా లోతుగా పెట్టాలి. దీనికి కొంచెం తవ్వటానికి ప్రారంభంచాలి. మా ఉద్దేశ్యము యేమంటే నవంబరు 23కి అయిపోవాలని. ఇప్పుడు 1600 గ్రామాలకు యివ్వాలి. ముందు 700 గ్రామాలు అనుకున్నాం. ఎంత మందికి యిస్తే అంతమంది ఆనందిస్తారు. ఇప్పుడు కడప వారు, చిత్తూరువారు వస్తున్నారు. నిజంగా చూస్తే భగవంతుడు చాలా విశాలహృదయుడు. అతనియొక్క కొలతలు యిట్టివి అట్టివి అని చెప్పలేము. తిరుపతిలో నివసించేది అతని స్థానము, త్రాగేది అతని తీర్థము, తినేది అతని ప్రసాదము, ఉండేది అతని జీవితము. తిరుపతివారు ఏమైనా చేయవచ్చు. కావలసినంత డబ్బు ఉంది. భక్తులు హృదయపూర్వకంగా అర్పితము చేసి ధనము. కానీ, అది దుర్వినియోగం అయిపోతున్నాది. తిరుపతిలోనే త్రాగటానికి నీరు లేదు. తిరుపతివారు వచ్చి అడిగారు. ఇస్తాను పొండి అని చెప్పాను. ఈవిధంగా అడిగిన వారికి కాదు అని చెప్పేది నా దగ్గర లేదు. అట్లా అని మీరు అన్నింటినీ అడగకూడదు. దానికి జవాబు చెబుతాను. 'నాయనా! ఇది నీవు కోరవలసింది కాదు. అవసరమైతే తప్పక యిస్తాను' అన తీచెబుతాను. మనం చేయవలసింది మనం చేయాలి. ఒక భక్తుడు ఉండేవాడు. మీకు తెలుసు, మైదాస్. అతనికి చాలా ఆశ వచ్చింది. ముట్టినదంతా బంగారు కావాలనుకున్నాడు. ఆ ప్రార్థన అంగీకరించి వీనికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశ్యంతో 'అవుతుంది, పో నయనా!' అన్నాడు. తెల్లవారి లేచాడు. అతను ముట్టాడు, బంగారమైపోయింది. ఇంకా ఆశ పెరిగింది. తోటలో ప్రవేశించాడు. చెట్లంతా ముట్టాడు. అంతా బంగారమైపోయింది. ఇంకా చేయాలని యిల్లంతా ముట్టాడు. బంగారమైపోయింది. తిరగటముతో అలసిపోయాడు. ఇంటికి వచ్చి మంచముపై కూర్చున్నాడు. మంచం బంగారమైపోయింది. బిడ్డను పిలిచాడు కాఫీ తెమ్మని. కాఫీ తీసుకు వచ్చింది . కాఫీ బంగారైపోయింది. దాహం తీరలేదు. ఆకలి వేసింది. అన్నం తీసుకు రమ్మన్నాడు. అన్నం తెచ్చింది. ముడితే బంగరైపోయింది. 'అయ్యో! ఇంక నా గతి యేమని' ఆబిడ్డను కరచుకుంటే ఆమె బంగారైపోయింది. అంతా బంగారే. ఆకలి, దప్పిక తీర్చుకోలేకపోయాడు. ఇంత మితిమీరిన ఆశకు పోతే గతి ఈరీతిగా అయిపోతుంది. ఆశకు పరిమితము ఉండాలి.

మనము చేయవలసింది ఈ సీమ అనే కాదు. ఎక్కడైనా స్వామి సేవగా భావించి మీరు ఏ గ్రామములోనైనా ఉండండి. ఏ పనిలోనైనా ప్రవేశించండి, భగవత్కార్యముగా భావించి సేవ చేయండి. మీ అందరిలో ఐకమత్యము పెరగాలి. అందరూ ఒక తల్లిబిడ్డలుగా భావించాలి. అదే brotherhood of man, fatherhood of god. ఈవిధంగా అన్నదమ్ములుగా ఐకమత్యముగా ఉండి, ఒకరికొకరికి భేదాలు రావచ్చు, ఆ భేదము భేదానికేగాని మీరు అభేదంగా ఉండాలి. అందరూ కలసిమెలసి ఉండండి. ఈవిధముగా మీరు చేస్తే భారతదేశమును ఎన్నో రీతులుగా తీర్చిదిద్దవచ్చు. ఆదర్శవంతమైన దేశముగా మనం తీర్చిదిద్దవచ్చు. ఎందుకంటే యిది మన దేశము. దేశాభిమానం మనలో రావాలి. అందువలనే రాముడు చెప్పాడు, 'జననీ జన్మభీమిశ్చ స్వర్గాదపి గరీయసి' నేను పుట్టిన జన్మభూమి, నా తల్లి. నా తల్లిపై నాకెంత గౌరవమో నా జన్మభూమిపై నాకంత గౌరవము. భారతభూమిని మాతృభూమిగా భావించండి.

ఇది నాదు మాతృదేశము
ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతం
బంచెదగొట్టి నుదువనేరక
బ్రతికిన జీవి యొకడైన వసుధను గలడా!

ఈ మాతృభావమే లేకపోతే పీనుగుతో సమానమే. మీరందరూ చక్కగా సేవలలోపల పాల్గొని, ఏ సేవ అయినా సరే, ఇది చిన్నదే యిది పెద్దదే అని కాదు, సేవ చేయాలి. ఊడ్చాలి ఊడుస్తాము. మన దేహమును మనం తుడుచుకోటం లేదా! పెద్దా, చిన్నా అని లేదు. పరిశుద్ధము కావాలి. అన్నీ మనం చేస్తాము.

ఐతే ఐకమత్యము కావాలి. ఈ ఐకమత్యం చేత ఏదైనా చేయవచ్చు. ఐకమత్యమే బలము. దీనికి మించిన బలము లేదు. ఈవిధంగా ఉండి విద్యార్థులు, సేవాదళ్ వారు చేరి ఐకమత్యముగా ఉండి పనులలో పాల్గొనాలి. ఈవిధంగా ఉండినప్పుడు మిమ్మల్ని అందరినీ యాత్రగా తీసుకు వెడతాను. సమ్మర్ లో పెద్ద ట్యాంకు కట్టాలి. అందరూ ఒకతూరి వద్దు. బ్యాచస్ బ్యాచస్‌గా రండి. భోజనాలు అన్నీ సిద్ధముచేసి నేనుకూడా అక్కడికి వస్తాను. ఇలాంటి ట్యాంకులు నాలుగు కట్టవలసి వలసి వస్తుంది. మా పిల్లలకు మార్చికి పరీక్షలు పూర్తవుతాయి. మీరు మీరు అంతా కలసి ఈ రాయలసీమలో దాహమనేది లేకుండా చేయాలి. 50 సంవత్సరములైంది స్వాతంత్ర్యము వచ్చి. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్‌లో చీఫ్‌మినిస్టరుగా ఉన్నాడు. అతనికి వాటర్‌సప్లై అప్పచెప్పారు. చెప్పాను, 'రామకృష్ణా! నదులు, కొండలు నేషనల్ ప్రోపరిటీ, ఒక స్టేట్‌ది కాదు. నేషనల్ ప్రోపరిటీగా చేస్తే

బాగుంటుందని నెహ్రూకి చెప్పమన్నాను. ఈయన చెప్పాడు. ఆయన వినలేదు. అందువలన అవస్థలంతా'. గోదావరి నాసిక్‌లో పుడుతున్నాది. ఇది నాది అని మహారాష్ట్రవారు పట్టుకున్నారు. తుంగభద్ర కర్నాటకలో పుడుతుంది. తుంగ అక్కడ పుడుతుంది. భద్ర యిక్కడ. రెండూ చేరి తుంగభద్ర అవుతుంది. కాబచ్చి, వీరిద్దరూ పోట్లాడుతున్నారు. వీరివీరి పోట్లాటలలో కావలసినంత నీరు సాగరములో పోతున్నాది. ఆ నీరంతా మీరు రిజర్వులో పెట్టుకోండి. అన్ని రాష్ట్రాలు ఆనందించండి. నిన్న గౌడ చెప్పాడు, ' స్వామికైతే తుంగభద్ర నీరు యిస్తాను. గవర్నమెంటుకు యివ్వను' అన్నాడు. 'పిచ్చివాడా! ప్రజలు ఎంత బాధపడుతున్నారో యేచన చేసుకో' అన్నాను. తుంగభద్ర అక్కడనుంచి తెచ్చే సమయంలో మున్నూరు నన్నూరు గ్రామాలు కర్నాటకలో వస్తాయి. వాటికి నీరు యివ్వమన్నారు. తప్పక యిస్తాము అన్నాను. కాబట్టి తుంగభద్ర నీరు యిట్లా తీసుకు రావచ్చు. ఈవిధంగా మనము చేస్తామంటే వద్దనేవారుంటారా! వద్దంటే మానేది కాదు సాయి సంకల్పము. తెలుగులో చెబుతారు, 'కొడుకును కంటానంటే అత్త వద్దంటుందా కోడలును'.ఆమె వద్దంటే మాత్రం కనటం మానుతుందా! వీరు వద్దన్నా గవర్నమెంటు చెప్పినా నేను మానను. సత్సంకల్పము ఎప్పటికీ సత్సంకల్పమే. ఈ సత్సంకల్పము మారేదిగానీ కూరెదిగానీ కాదు. చేయాలనుకున్నాను. రాయలసీమకంతా చేస్తాను. కడప, చిత్తూరు, కర్నూలు. పూర్వం బళ్లారికూడా ఉండేది. బ్రిటీషువారు backward class అని పేరు పెట్టారు. b..బళ్లారి a..అనంతపురం c..కడప k..కర్నూలు కానీ వెనుకబడినది కాదు. ఆదర్శవంతమైన దేశంగా తయారుచేయాలి. రాయలవారు ఏలిన దేశమిది. రాయలసీమ రత్నాసీమగా మార్చాలి. ఏమీలేకపోయినా ప్రజలకు త్రాగే నీరు, పంటలు పండేలాగ అనుకూలాలు చేస్తే అంతకంటె మనం చేయవలసింది మరొకటి లేదు. నాకింకా సంకల్పములుంటున్నాయి. కరీంనగర్, తెలంగాణాలో కొన్ని ప్రాంతాలలో నీరు లేక అవస్థ పడుతున్నారు. వారూవీరూ మన వారే! అందరికీ యిక్కట్లు లేకుండా చూచుకోవాలి. ముఖ్యంగా మీరు దైవభక్తి పెంపొందించుకోండి. దైవవిశ్వాసము లేక మనము యేదీ చేయలేము. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఈ మూడింటియందు మన జీవితము అంకితము చేయాలి. మీరు చక్కని అభివృద్ధి పొంది, ఆదర్శవంతమైన పురుషులుగా రూపొంది ఆదర్శ పౌరులుగా రూపొందుతారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ప్రేమస్వరూపులైన యువకులారా! ఈనాటి సమావేశముతో మాత్రమే తృప్తి పడక భవిష్యత్తులో ఈ సంస్థ అభివృద్ధిని మనము ఆశించి తగిన ప్రచార ప్రబోధలు సల్పి ప్రపంచమునకు సరైన ఆదర్శము నిరూపిస్తారని ఆశిస్తున్నాను. ముఖ్యముగా మీలో మీరు సంప్రదించుకొని సరైన వారిని ఒక కమిటీ పెట్టుకొని రిజిష్టరు చేసుకొని మన ఆంధ్రదేశములో ఆరోగ్య విషయములోగానీ, ఆధ్యాత్మిక విషయములోనైనా సరైన మార్గములో పల్లె ప్రజలకు నచ్చ చెప్పి వారిని తగిన మార్గములో పెట్టటానికి కమిటీని ప్రారంభించి తగిన బాధ్యత కొంమంది వహించిన, మీరు యువకులు, మీకు ఆదాయము ఎక్కువ లేకుండా ఉండవచ్చును. మీ కమిటీ తరఫున మీకయ్యే ఖర్చులకు అంతా నేను కొన్ని లక్షలు పెడతాను. మీరు సరైన ప్రచార ప్రబోధలు చేసి రాయలసీమయేకాక ఆంధ్రప్రదేశ్ అంతా సరైన స్థితిలోపల తెప్పించి ఎక్కడ కానీ యేవిధమైన అల్లకల్లోలములు జరుగకుండా సేవలలో మీరు పాల్గొని తగిన సత్కీర్తిని ఆర్జించి ఆదర్శవంతమైన వారుగా మీరు తయారౌతారని నేను ఆశిస్తున్నాను. నేడు మీరు సంప్రదించి, రేపటి దినము శివరాత్రి, మీ మెంబర్లు నాకు యిస్తే నేను వారిని ఒక తూరి సంప్రదించి దానికి తగిన బందోబస్తును, చేయవలసిన ముందు కార్యక్రమములకు తగిన సహాయము నేను చేయటానికి సిద్ధంగా ఉన్నాను. నాకేదీ అవసరం లేదు. మీరందరూ బాగుపడి, 'సర్వే జనాః సుఖినో భవంతు' ప్రార్థన చేస్తున్నారు. ప్రార్థనతోబాటు ఆచరణలో కూడా ఆనందమునందుకొని, అందించి మీరుకూడా ఆనందిస్తారని నేను ఆశిస్తున్నాను.

జైసాయిరాం